షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 203 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 06 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 198 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 1 June 2024 PAGES : 8 PRICE : 3/-


## మహారాష్ట్రలో బిజెపి వైఫల్యం..

### బాధ్యత వహిస్తూ ఫడ్నవీస్ రాజీనామా

ముంబై,జూన్5(షణ్ముఖవెలుగు):
మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తన పదవికీ రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను బుధవారం ఆయన బీజేపీ అగ్ర నాయకత్వాన్ని పంపారు. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అనుకున్న ఫలితాలు సాధించలేకపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్రమంలో డిప్యూటీ సీఎం పదవి నుంచి తనను తప్పించాలని పార్టీకి విజ్ఞప్తి చేశారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు త్వరలో




# టీడీపీకి పునరుజ్జీవం..



### బాబు రాజకీయ అనుభవంతో మళ్లీ అధికారంలోకి..

చంద్రబాబు అంటేనే ఒక బ్రాండ్. అభివృద్ధికి అయన ఒక నమ్మకం.. పాలనా అనుభవం.. అయినా గత ఎన్నికల్లో ఆయనను జనం పక్కాన పెట్టారు. జగన్ ఎదో చేస్తాడనే నమ్మకం తో వైసిపీని గెలిపించారు. కాని కొద్దిరోజుల్లోనే ప్రజల ఆశలు అవిరయ్యాయి. ఆశించిన అభివృద్ధి జరగపోవడంతో గత ప్రభుత్వంపై ప్రజలు ఆశలు వదులుకొని మళ్లి బాబు రావాలి అనే దృడ సంకల్పంతో వైసీపీని ఇంటికి పంపించారు. ఇక పార్టీకి పూర్వ వైభవం తేవడానికి అధినేత మొక్కవోని దీక్షతో సరైన ప్రణాళికతో , అధికార పక్షానికి సరైన చెక్ పెట్టారు. గతం లో అధికారం కోల్పోయినా మళ్లీ అధికారం సాధించగలననే నమ్మకం తో అధికార పక్షం ఎత్తులను చిత్తుచేస్తూ సరైన సమయంలో పోత్తులకు సైతం సిద్ధమై అధికారం చేపట్టేందుకు సిద్ధమయ్యాడు.

- ఓటరు నాడిపట్టడంలో సక్సెస్ అయిన చంద్రబాబు
- గెలుపునకు నాంది పలికి కూటమి ఏర్పాటు
- విజయానికి బాటలు వేసిన సూపర్ సిక్స్ స్కీంలు
- రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మిన ఆంధ్ర జనం
- అందుకే మళ్లి పట్టం కట్టిన ప్రజానీకం

## విధ్వంసానికి గురైన ఎపిని గాడిలో పెడతాం

### ఎంతటి త్యాగాలకైనా వెనకాడకుండా పనిచేస్తాం

- జగన్ ఐదేళ్ల పాలనను గతంలో ఎప్పుడూ చూడలే
- భావితరాల భవిష్యత్ కోసం ముందుకు సాగుతాం
- ఇంతటి చారిత్రక విజయం ప్రజలిచ్చిన వరం
- వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పోతాం
- పవన్ కళ్యాణ్ సంకల్ప బలంత బాగా కలిసి వచ్చింది

మీడియా సమావేశంలో చంద్రబాబు నాయుడు

అమరావతి,జూన్5(షణ్ముఖవెలుగు):
విధ్వంసానికి గురైన ఎపిని గాడిన పెట్టి, పరిస్థితులను చక్కబెట్టడమే తమ ముందున్న ప్రధాన బాధ్యత అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి విధ్వంసాన్ని, ఇలాంటి పాలనను చూడలేదని అన్నారు. ఎన్నికల్లో కూటమికి అఖండ విజయం కట్టబెట్టినందుకు రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. మీడియా సహా ప్రజలందరికీ ధన్యవాదాలు చెప్పారు. ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహించిన




## 17వ లోక్‌సభ రద్దు

### ప్రకటన విడుదల చేసిన రాష్ట్రపతి భవన్

### రద్దుకోరుతూ ప్రధాని రాష్ట్రపతికి లేఖ

న్యూఢిల్లీ,జూన్5(షణ్ముఖవెలుగు):
భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 17వ లోక్‌సభను రద్దు చేశారు. ప్రస్తుత లోక్‌సభను రద్దు చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారధ్యంలోని కేంద్ర క్యాబినెట్ బుధవారం ఉదయం సిఫారసు చేసింది. ఆ వెంటనే మోదీ తన రాజీనామాతో పాటు మంత్రివర్గ రాజీనామా పత్రాలను రాష్ట్రపతిని కలిసి నేరుగా కలిసి సమర్పించారు. రాష్ట్రపతి వెంటనే ఆమోదం తెలుపుతూ, కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసేంతవరకూ ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగాలని మోదీని కోరారు. అనంతరం కొద్ది గంటలకే 17వ లోక్‌సభను



## ఎన్డీయే నేతగా మోడీ ఏకగ్రీవ ఎన్నిక

- మోడీ నాయకత్వంపై విశ్వాసం ప్రకటించిన నేతలు
- ఎన్డీయే పక్ష నేతల మూకుమ్మడి మద్దతు
- రాష్ట్రపతిని కలిసి లేఖ అందచేయనున్న నేతలు

8న ప్రధానిగా మోడీ మరోమారు ప్రమాణం




న్యూఢిల్లీ,జూన్5(షణ్ముఖవెలుగు):
ఎన్డీయే పక్షనేతగా నరేంద్రమోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు భాగస్వామ్య పార్టీల నేతలు తీర్మానించారు. దిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన సమావేశానికి తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, జేడీయూ అధ్యక్షుడు నీతీశ్ కుమార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీనియర్ నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేడీఎస్ నేత కుమారస్వామి, చిరాగ్ పాశ్వాన్ తదితరులు హాజరయ్యారు. మోదీ సారథ్యంలో పదేళ్లుగా ప్రజాసంక్షేమ విధానాల కారణంగా 140 కోట్ల మంది దేశ ప్రజలు

## మోదీకి రాజకీయ, నైతికంగా పరాజయమే

- ఇండి కూటమికి భారీ ప్రజా మద్దతు లభించింది
- ఓటర్లకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు
- బీజేపీ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా కూటమి పోరాటం
- ఇండి కూటమిలోని స్నేహితులందరికీ స్వాగతం
- కలిసికట్టుగా పోరాడాం.. సమన్వయంతో పోరాడాం

ఇండి కూటమిలోని పార్టీల నేతల సమావేశంలో ఖర్గే

న్యూఢిల్లీ,జూన్5(షణ్ముఖవెలుగు):
ఇండి కూటమికి లభించిన భారీ ప్రజా మద్దతుకు తాము దేశంలోని ఓటర్లకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని కూటమిలోని నేతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు బీజేపీకి, వారి ద్వేషానికి, అవినీతికి,



## రెవెన్యూ శాఖలో దస్త్రాలను ప్రాసెస్ చేయవద్దు

### ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఆదేశాలు

అమరావతి,జూన్5(షణ్ముఖవెలుగు):
రెవెన్యూ శాఖలో ముఖ్యమైన దస్త్రాలను ప్రాసెస్ చేయవద్దని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఆదేశాలు జారీ చేశారు. మంత్రి పేషీలోని రికార్డులు, దస్త్రాలను జాగ్రత్తపరచాలని సిబ్బందికి సూచించారు. గుత్తేదారులకు నిధుల విడుదల, భూ కేటాయింపు దస్త్రాలు నిలిపివేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. బదిలీలు, సెలవులపై కూడా నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. మరో వైపు సచివాలయంలోని మంత్రుల ఛాంబర్లను సాధారణ పరిపాలనశాఖ స్వాధీనం చేసుకుంటోంది. మంత్రులు, సలహాదారుల పేషీల నుంచి నేమ్ బోర్డులను జీఏడీ సిబ్బంది తొలగించారు. మంత్రుల పేషీల్లోని ఫర్నీచర్, కంప్యూటర్‌ల వివరాలను నమోదు చేసుకుని జీఏడీ అధికారులు లెక్కలు సరిపోల్చుకుంటున్నారు.

## ఏపీ అసెంబ్లీ రద్దు..

### గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ

### 12న అమరావతిలో సీఎంగా బాబు ప్రమాణ స్వీకారం

అమరావతి,జూన్5(షణ్ముఖవెలుగు):
ఏపీ అసెంబ్లీని రద్దు చేస్తూ.. గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం సీఎం పదవికి రాజీనామా చేయగా.. దానిని గవర్నర్ ఆమోదించారు. జగన్ రాజీనామాతో ఆంధ్రప్రదేశ్ శాసనసభను రద్దు చేస్తూ గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 12న అమరావతిలో సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జూన్ 9న ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరనుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో గ్రాండ్ విజయం సాధించిన చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేష్, బాలకృష్ణ తదితరులకు ప్రముఖులు శుభాకాంక్షలు చెబుతున్నారు.




## అవినీతిపై దండయాత్ర కొనసాగిస్తా

### మంత్రివర్గ భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ,జూన్5(షణ్ముఖవెలుగు):
సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన ఎన్డీయే కూటమి కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే బుధవారం

## జవాబుదారీ ప్రభుత్వాన్ని నడుపుదాం



- ఖచ్చితంగా జీతం తీసుకుని పనిచేస్తా
- ప్రజల స్వేదం చిందించిన డబ్బుతో అప్రమత్తంగా ఉంటా

ఎంపిలు, ఎమ్మెల్యేలతో భేటీలో పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు

అమరావతి,జూన్5(షణ్ముఖవెలుగు):
ఎమ్మెల్యేగా తాను పూర్తి జీతం తీసుకుంటానని జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఏపీ ఎన్నికల్లో సంచలన విజయం తర్వాత జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఫలితాలు మరింత బాధ్యత పెంచాయని అన్నారు. 'నేను కూడా ఎమ్మెల్యేగా సంపూర్ణ జీతం తీసుకుంటా. ఎందుకంటే

## ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం

- చంద్రబాబు, పవన్‌లకు షర్మిల శుభాకాంక్షలు
- ప్రజల ఆకాంక్షలు నెరేవరేలా పాలించాలని సూచన

విజయవాడ,జూన్5(షణ్ముఖవెలుగు):
రాష్ట్ర ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు , జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఈ సందర్భంగా ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

## ప్రజలు లేకుండా జగన్ పాలన

### అందుకే విపక్షానికి కూడా పనికిరారని తీర్పు

మాజీమంత్రి, టిడిపి నేత యనమల



కాకినాడ,జూన్5(షణ్ముఖవెలుగు):
ప్రజాస్వామ్యంలో ప్రజలు చాలా ముఖ్యమని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ప్రజలను విస్మరించి పాలన చేయలేమని అన్నారు. కూటమి గెలుపు తర్వాత యనమల తొలిసారిగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలు చాలా ముఖ్యమన్నారు. నాయకుల ప్రవర్తన సరిగా లేకపోతే ప్రజలు గుణపాఠం చెబుతారన్నదానికి ఎన్నికల ఫలితాలే ఉదాహరణ

# టీడీపీకి పునరుజ్జీవం..

మొదటిపేజీ తరువాయి..

అమరావతి,జూన్5(షణ్ముఖవెలుగు): గతంలో తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. 23 స్థానాలకే పరిమితమైంది. అనంతరం రాజకీయ పరిణామాల నేపథ్యంలో పలువురు ఎమ్మెల్యేలు టీడీపీకి గుడ్ బై చెప్పేసి వైసీపీ పంచన చేరిన సంగతి తెలిసిందే. అనంతరం జరిగిన స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో కనీసం పోటీ చేసేందుకు కూడా అభ్యర్థులు కరువైన పరిస్థితి నెలకొంది. అంతేకాదు రాజ్యసభలో కనీసం టీడీపీ ప్రాతినిధ్యం లేకుండా పోయినంత. టీడీపీలో పునరుజ్జీవం నింపేందుకు చంద్రబాబు నాయుడు ఏ కార్యక్రమం చేపట్టినా తొక్కిసలాటలు జరగడం ప్రజలు ప్రాణాలు కోల్పోవడం లాంటి అవాంతరాలు ఎదురయ్యేవి. ఆ తర్వాత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టడంతో పార్టీకి మంచి మైలేజ్ వచ్చింది. స్కిల్ డవలప్‌మెంట్ స్కాం కేసులో చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం ఆ పార్టీకి ఎక్కడా లేని సానుభూతి వచ్చింది. టీడీపీ పరిస్థితి ఏమైపోతుందో అనుకునే సమయంలో పవన్ కల్యాణ్ వచ్చి మద్దతు పలకడంతో టీడీపీ బతికిబట్టకట్టగలిగింది. చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదలైన తర్వాత పవన్ కల్యాణ్‌తో కలిసి చేసిన రాజకీయం సక్సెస్ అయ్యింది. ఒకవైపు బీజేపీని పొత్తుకు ఒప్పించి ఎలాంటి విబేధాలు లేకుండా టికెట్ల సర్దుబాటు సైతం చేసుకున్నారు. ఇవన్నీ ఒక ఎత్తైతే కూటమికి అనుకూలంగా ఓటర్లను మలచుకోవడంలో ఈ పార్టీలన్నీ సక్సెస్ అయ్యాయి. దీంతో కూటమి విజయానికి బాటలు వేసినట్లు అయ్యింది. ఇలా కూటమి గెలుపునకు ప్రధానంగా ఐదు కారణాలు ఉన్నాయి. ఒకటి కూటమి ఏర్పాటు, చంద్రబాబు నాయుడు అరెస్ట్, యువగళం పాదయాత్ర, సూపర్ సిక్స్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటి కార్యక్రమాలు కూటమిని ప్రతిపక్షం నుంచి అధికార పీఠం గద్దెనెక్కించేలా చేశాయి. తెలుగుదేశం పార్టీకి అతిపెద్ద అస్త్రం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్. ఈ అస్త్రాన్ని కూడా ఎవరో ఇవ్వలేదు సాక్షాత్తు అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టుకెళ్లి చంద్రబాబు చేతులో పెట్టినట్లు పెట్టింది. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు జరిగితే మీ పొలాలు మీ చేతుల్లో ఉండవు అంటూ చంద్రబాబు అండ్ కో విపరీతంగా ప్రచారం చేశారు. మీ భూములకు సంబంధించి పత్రాలు జిరాక్స్ మాత్రమే ఉంటాయని ఒరిజినల్స్ మాత్రం జగన్ వద్ద ఉంటాయని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అంతేకాదు పట్టాదారు పాస్ పుస్తకంపై రాజముద్ర ఉండాలే కానీ జగన్ ముద్ర ఏమిటని చంద్రబాబు అండ్ కో నిలదీశారు. వైసీపీ అధికారంలోకి వస్తే మీ భూములు మీ చేతుల్లో ఉండవు. జగన్ చేతుల్లోకి వెళ్లిపోతాయి. లోన్లు కూడా రావు అని ప్రజల్లోకి చంద్రబాబు నాయుడు తీసుకెళ్లారు. ఇది నిజమని నమ్మిన ప్రజలు చిన్న, సన్నకారు రైతుతు బాబోయ్ జగన్..బైబై జగన్ అంటూ ఓట్లు కూటమికి గుద్దిపడేశారు. కూటమిగా ఏర్పడి ఎన్నికల ప్రచారం చేస్తున్నప్పటికీ కూటమిలో ఏదో స్తబ్దత నెలకొంది. ఎప్పుడైతే ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే అస్త్రం దొరికిందో ఇక ఆనాడే కూటమి గెలుపు దాదాపు ఖాయంగా మారింది. ఈ ఎన్నికల్లో కూటమి గెలుపొందింది అంటే అందుకు కారణం కూటమి పార్టీలలోని ఏకాభిప్రాయం. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ ఆ పార్టీకి మద్దతు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలిసి ఎన్నికలకు వెళ్తున్నాని తెగేసి చెప్పుకొచ్చారు. అప్పటికి కూడా బీజేపీ టీడీపీతో కలిసి వెళ్లేందుకు సిద్ధంగా లేదు. అయినప్పటికీ పవన్ కల్యాణ్ కూటమి బాధ్యతలను తమ భుజస్కందాలపై వేసుకుని కూటమి ఏర్పాటులో సక్సెస్ అయ్యారు. ఇలా నేడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్నారన్నా..కూటమి అధికారంలోకి వచ్చింది అని చెప్పుకుంటున్నా అందుకు నిదర్శనం కూటమి ఏర్పాటుయే కారణం అనేది నగ్న సత్యం. కూటమి ఏర్పాటవ్వడంతోపాటు అటు టీడీపీ ఇటు జనసేన మరోవైపు బీజేపీ మూడు పార్టీలు కలిసి అడుగులు వేయడం... కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించడం, ప్రధాని నరేంద్రమోడీతో సత్సంబంధాలు కలిగి ఉండటంతో ప్రజలు కూటమికి జై కొట్టారనడంలో ఎలాంటి సందేహం లేదు. స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో కుంభకోణం జరిగిందని వైసీపీ ఆరోపించింది. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన సీఐడీ విచారణ చేపట్టింది. చివరకు చంద్రబాబు నాయుడును కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో టీడీపీ అనేక కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లింది. నిజం గెలవాలి అంటూ నారా భువనేశ్వరి సైతం రోడ్డెక్కిన పరిస్థితి. ఈ కాలంలో 15ఏళ్లు సీఎంగా చంద్రబాబు నాయుడు ఏం చేశారో అనేది బయటపడింది. ప్రతీ ఒక్కరూ చంద్రబాబు అనుభవాన్ని.. సైబరాబాద్ నిర్మాణం, ఐటీ డవలప్‌మెంట్ అభివృద్ధికి చంద్రబాబు నాయుడే కారణమనే వాస్తవాలు ప్రజలకు స్పష్టంగా కనిపించాయి. దీంతో యువత బ్రింగ్ బాబు బ్యాక్ అంటూ టీడీపీకి ఆకర్షితులు అయ్యారు. ఇది కూటమి గెలుపులో ఒక మేజర్ ఇన్సిడెంట్‌గా చెప్పుకోవచ్చు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర టీడీపీ యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. 27 జనవరి 2023న నారా లోకేశ్ తన తండ్రి సొంత నియోజకవర్గం అయిన కుప్పం నుంచి ఈ పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన నందమూరి తారకరత్న కన్నుమూసిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో యువగళం నిర్వహించారు. ఈ యువగళం పాదయాత్రకు సైతం ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. అవాంతరాలు ఎదురయ్యాయి. రాళ్ల దాడులు జరిగాయి. అయినప్పటికీ లోకేశ్ ఏమాత్రం వెనకడుగు వేయకుండా యువతతో మమేకం అవుతూ ముందుకు వెళ్లారు. ఈ ఉత్సహమే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కలిసి వచ్చిందనే చెప్పాలి. ఇకపోతే సూపర్ సిక్స్ స్కీంలు కూటమికి బాగా కలిసి వచ్చాయి. ప్రతీ టీడీపీ కార్యకర్త, జనసేన కార్యకర్తలు ఈ సూపర్ సిక్స్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సక్సెస్ అయ్యారు. ముఖ్యంగా మహిళలలు కూటమికి అట్రాక్ట్ అయ్యారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో ఆరు హామీలు ప్రజలను ఎంతగానో ఆకర్షించాయి.

# ఎన్డీయే నేతగా మోడీ ఏకగ్రీవ ఎన్నిక

మొదటిపేజీ తరువాయి..

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారు. చాలా సుదీర్ఘ విరామం.. దాదాపు 6 దశాబ్దాల తర్వాత దేశ ప్రజలు వరుసగా మూడోసారి సంపూర్ణ మెజారిటీతో బలమైన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ నేతృత్వంలో ఐక్యంగా పోరాడి గెలిచినందుకు గర్విస్తున్నామని పేర్కొన్నారు.

భారతదేశ వారసత్వాన్ని పరిరక్షించడం ద్వారా.. దేశ సర్వతోముఖాభివృద్ధి కోసం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఎన్డీయే ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తీర్మానంలో నేతలు పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఎన్డీయే కూటమి ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. ఎన్డీయే నేతగా నరేంద్ర మోదీ పేరుకు మద్దతు ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు, అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో సుమారు గంటన్నర సేపు జరిగిన ఎన్డీయే కీలక సమావేశంలో ఈ నిర్ణయిం తీసుకున్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు లేఖలను కూటమి కీలక భాగస్వాములుగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జేడీయూ నేత నితీష్ కుమార్ అందజేశారు. కాగా, ఎన్డీయే కీలక సమావేశం పూర్తికావడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకునేందుకు ఎన్డీయే ప్రతినిధి బృందం సిద్ధమవుతోంది. రాత్రి 7.30 గంటలకు రాష్ట్రపతిని కలుసుకోనున్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాల్సిందిగా రాష్ట్రపతిని ప్రతినిధి బృందం కోరనుంది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం తమకు ఉందంటూ భాగస్వామ్య పార్టీల మద్దతుతో కూడిన లేఖను అందజేయ నుంది. మూడోసారి ప్రధానమంత్రిగా మోదీ ఈనెల 8న ప్రమాణస్వీకారం చేసేందుకు నిర్ణయించినట్టు పార్టీ వర్గాల సమాచారం. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సొంతంగా 240 సీట్లు గెలుచుకున్నప్పటికీ మెజారిటీకి దూరంగా ఉండిపోయింది. అయితే, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి 292 సీట్లు గెలుచుకోవడంతో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ మార్క్ 272ను అవలీలగా దాటింది. కాగా, 18వ లోక్‌సభ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ, 17వ లోక్‌సభను రద్దు చేయాల్సిందిగా కేంద్ర క్యాబినెట్ బుధవారం ఉదయం నిర్ణయం తీసుకుంది. అనంతరం ప్రభుత్వ రాజీనామాను ప్రధాన మోదీ స్వయంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేశారు. వెంటనే ఆమోదించిన రాష్ట్రపతి కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసేంత వరకూ ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగాలని మోదీని కోరారు.

# ఏపీ అసెంబ్లీ రద్దు..

మొదటిపేజీ తరువాయి..

మెగా ఫ్యామిలీ, దగ్గుబాటి ఫ్యామిలీ, నందమూరి ఫ్యామిలీల హీరోలంతా నెట్టింట శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు చేస్తున్నారు. హీరో రామ్ చరణ్ బాబాయ్ పవన్ గెలుపుపై ఆనందం వ్యక్తం చేశాడు. మా కుటుంబానికి గర్వకారణమైన రోజు.. మీ అద్భుతమైన విజయానికి నా అభినందనలు మై పవన్ కళ్యాణ్ గారూ!" అంటూ %ఠ% వేదికగా ట్వీట్ చేశాడు. పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు సినీ నటుడు వెంకటేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. "చారిత్రక విజయం సాధించిన ప్రియమైన పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు. ఈ విజయానికి నీవు సంపూర్ణ అర్హుడివి. ఇదే ఉత్సాహంతో ఉన్నతస్థానాలకు ఎదగాలని కోరుకుంటున్నా. పిఠాపురం ఎమ్మెల్యేగారికి మరోసారి నా హృదయ పూర్వక శుభాకాంక్షలు" అని ట్వీట్ చేశారు. చంద్రబాబుకు హీరో కళ్యాణ్ రామ్ శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రలో నిలిచిపోయే ఘనమైన విజయాన్ని సాధించిన చంద్రబాబు మావయ్యకీ తన హృదయపూర్వక అభినందనలు అని ఆయన ట్వీట్ చేశారు. మీ కృషి, పట్టుదల ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మెరుగుపరుస్తుందని ఆశిస్తున్నా అన్నారు. అలాగే మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన బాలకృష్ణ కు శుభాకాంక్షలు తెలిపారు.

# 17వ లోక్‌సభ రద్దు

మొదటిపేజీ తరువాయి..

రద్దయినట్టు రాష్ట్రపతి భవన్ నుంచి ఒక ప్రకటన వెలువడింది. జూన్ 5వ తేదీ 2024న కేంద్ర మంత్రివర్గం చేసిన సిఫారసు మేరకు రాజ్యాంగంలోని 85వ నిబంధన సబ్-క్లాజ్ (2) కింద నాకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ 17వ లోక్‌సభను రద్దు చేస్తున్నాను' అని రాష్ట్రపతి భవన్ నుంచి వెలువడిన ప్రకటనలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. కాగా, ప్రస్తుత లోక్‌సభ రద్దు కావడంతో 18వ లోక్‌సభ ఏర్పాటుకు, కొత్త ప్రభుత్వం కేంద్రంలో పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. షెడ్యూల్ ప్రకారం 17వ లోక్‌సభ గడువు జూన్ 16వ తేదీతో ముగియాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తరుణంలో, కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు వీలుగా నరేంద్ర మోదీ బుధవారం ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఆయన రాష్ట్రపతి భవన్‌కు చేరుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా సమర్పించారు. అలాగే, 17 వ లోక్‌సభను రద్దు చేయాలని రాష్ట్రపతి ముర్ముకు సిఫారసు చేశారు. రాష్ట్రపతి దీనిని అంగీకరించి, తాత్కాలిక ప్రధానమంత్రిగా కొనసాగాలని కోరారు. ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము మధ్య భేటీకి



సంబంధించిన దృశ్యాలు వెలువడ్డాయి. ఢిల్లీలో ఎన్డీఏ సమావేశానికి ముందు ప్రధాని మోదీ తన రాజీనామాను అధ్యక్షుడు ముర్ముకు సమర్పించారు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన మోదీ, ఈ సాయంత్రం జరిగే ఎన్డీఏ కూటమి సమావేశంలో మరోసారి ఆయన్ను పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో 17 వ లోక్‌సభను రద్దు చేయాలని రాష్ట్రపతి ముర్ముకు సిఫారసు చేశారు. జూన్ నెల 7వ తేదీన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకుంటారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఎన్డీఏ కూటమికి 293 స్థానాలు, ఇండియా కూటమికి 263 స్థానాలు దక్కాయి. ఎన్డీఏ 272 సీట్ల మ్యాజిక్ ఫిగర్ దాటడంతో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని రాష్ట్రపతిని కూటమి నేతలు కోరబోతున్నారు. జూన్ నెల 8వ తేదీన మరోసారి మోదీ దేశ ప్రధానిగా ప్రమాణం చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిజానికి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 294 సీట్లతో మెజారిటీ వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. బీజేపీకి సొంతంగా మెజారిటీ రాలేదు. దీంతో ఎన్డీయే మిత్రపక్షాలు తప్పుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాంటి పరిస్థితి వస్తే మళ్లీ ఎన్డీయే అధికారంలోకి రావడం కష్టమే. బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీష్ కుమార్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గురించే ఎక్కువగా చర్చ జరుగుతోంది. అయితే ఇరువురు నేతలు మాత్రం ఇప్పటికే ఎన్డీయేతోనే ఉంటామనే సంకేతాలు ఇచ్చారు. బుధవారం ఢిల్లీలో ఎన్డీయే సమావేశంలో పాల్గొనేందుకు దాని మిత్రపక్షాల ప్రముఖ నేతలు ఢిల్లీ చేరుకున్నారు. నితీష్ కుమార్ కూడా ఢిల్లీ చేరుకున్నారు. చంద్రబాబు నాయుడు , పవన్ కళ్యాణ్ ఢిల్లీకి బయలుదేరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటు, తదుపరి వ్యూహంపై చర్చించనున్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని బీజేపీ పూర్తిగా ధీమాగా ఉంది. ఈ కారణంగానే జూన్ 7న పార్లమెంట్ హౌస్‌లో ఎన్డీయే ఎంపీలందరితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ అధ్యక్షతన ఈరోజు కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశంలో ఎన్నికల ఫలితాలను సమీక్షించడంతో పాటు ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ప్రస్తుత లోక్‌సభను రద్దు చేయాలని కేబినెట్ సిఫార్సు చేసింది. దీనిపై లోతుగా చర్చించిన తర్వాతే ప్రధాని మోదీ రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు.

# మహారాష్ట్రలో బిజెపి వైఫల్యం..

జరగనున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే బాధ్యత తనకు అప్పగించాలని తన రాజీనామా లేఖలో పార్టీ అగ్రనాయకత్వాన్ని కోరారు. ఈ రోజు ఉదయం ముంబైలో ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బివానుఖులే అధ్యక్షతన ఆ పార్టీ నేతలు సమావేశమయ్యారు. ఆ క్రమంలో ఈ ఎన్నికల్లో బీజేపీ అతి తక్కువ సీట్లు గెలుచుకుంది... అలాగే ఓటింగ్ శాతం కూడా భారీగా తగ్గింది... ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 23 స్థానాల్లో విజయం సాధించింది. కానీ ఈ సారి అంతకు మించి సీట్లు గెలుచుకోక పోగా 14 సీట్లకు ఎందుకు కోత పడిందనే అంశాలపై ఈ సమావేశంలో వాడి వేడిగా చర్చ జరిగింది. అదీకాక ఈ ఏడాది నవంబర్ తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తనను డిప్యూటీ సీఎం పదవి నుంచి తప్పించాలంటూ పార్టీ అగ్రనాయకత్వానికి డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా లేఖ పంపారు. మహారాష్ట్రలో మొత్తం 48 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అయితే తాజాగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ 9 స్థానాల్లో నెగ్గింది. ఇక కాంగ్రెస్ పార్టీ 13 స్థానాల్లో, శివసేన ఉద్ధవ్ ఠాక్రే 9 స్థానాల్లో, ఎన్సీపీ శరద్ పవార్ పార్టీ 8 స్థానాల్లో గెలిచింది. అయితే 2019 లోక్ సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో బీజేపీ 23 సీట్లు సాధించిన సంగతి తెలిసిందే.

## అవినీతిపై దండయాత్ర
# కొనసాగిస్తా

మొదటిపేజీ తరువాయి..

ప్రధాని నివాసంలో కేంద్ర మంత్రివర్గం చివరిసారిగా సమావేశమైంది. ఈ సందర్భంగా మోదీ కేబినెట్‌కు కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలపై కూడా ఆయన మాట్లాడారు. ఫలితాల్లో నంబర్ల గేమ్ కొనసాగుతూనే ఉంటుంది. ఇది రాజకీయాల్లో భాగమే. దశాబ్ద కాలంలో దేశ అభివృద్ధికి సర్కార్ ఎంతో కృషి చేసింది. అందుకు మీరూ ఎంతో శ్రమించారు. దీన్ని ఇలాగే కొనసాగించండి. అవినీతిపై పోరాటం మరింత పటిష్ఠంగా మారుతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం అవినీతిని కొందరు కీర్తిస్తున్నారు. ఈ సారి అవినీతిని రూపుమాపడంపై ఎన్డీయే దృష్టి సారిస్తుంది. ప్రపంచంలో భారత్ బలమైన శక్తిగా అవతరిస్తుంది. మనమంతా సమష్టిగా కృషి చేస్తే సరికొత్త అధ్యాయాన్ని లిఖించవచ్చు. ఇదే ప్రజలకు మోదీ హామీ అని ప్రధాని అన్నారు. ఇందుకు కూటమి కట్టుబడి ఉంది..కొందరు 10 గంటలు పనిచేస్తే.. నేను దేశం కోసం 18 గంటలు శ్రమిస్తా. వారు రెండు అడుగులు వేస్తే.. నాలుగు అడుగులతో ముందుకు సాగుతా. అన్ని ప్రాంతాలు, వివిధ వర్గాల ప్రజల అభివృద్ధికి ఎన్డీయే కూటమి కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు. సమావేశం అనంతరం ప్రధాని తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు. జూన్ 8న మోదీ ప్రధానిగా మరోసారి ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. దిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఈ కార్యక్రమం జరగనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

# ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం

శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్నికల్లో ఓటమిపై స్పందించిన ఆమె బుధవారం విజయవాడ లో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన కొత్త ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏపీకి ప్రత్యేక హోదా రావాలని, పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి కావాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే ఏపీకి రాజధాని నిర్మాణం జరగాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సంక్షేమం, అభివృద్ధి సమానంగా సాగాలని, ప్రజలు ఇచ్చిన ఇంత పెద్ద మెజారిటీతో ముందుకు అడుగు వేయాలని షర్మిల అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ఆలోచన చేసి, ప్రత్యేక హోదా కోసం కట్టుబడాలని, అన్ని విభజన హామీలకు కేంద్రం కట్టుబడాలని.. అలా అయితేనే కేంద్రానికి మద్దతు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ, జనం గొంతుకగా మారిన కాంగ్రెస్ పార్టీ, ఇక మీదట కూడా రాష్ట్ర ప్రజల పక్షాన నిలబడుతుందని, ప్రభుత్వ నిర్లక్ష్యాలను ఎండగడుతుందని షర్మిల స్పష్టం చేశారు.



## జవాబుదారీ ప్రభుత్వాన్ని
# నడుపుదాం

మొదటిపేజీ తరువాయి..

ఈ డబ్బు ప్రజల రక్తం, చమట, స్వేదం నుంచి వచ్చింది.

ఆ డబ్బు ముట్టుకున్నప్పుడల్లా నాకు ఆ బాధ్యత అనుక్షణం గుర్తు రావాలి. ఒకవేళ నేను సరిగా పని చేయకుంటే ప్రతి రూపాయికి నన్ను చొక్కా పట్టుకుని



నిలదీసే హక్కు ప్రజలకు ఉండాలి. అందుకే పూర్తి జీతం తీసుకుంటాను. ఆ తర్వాత ఇవ్వాల్సింది ఎలాగో ఇచ్చేస్తాను. అందరం కూడా జవాబుదారి ప్రభుత్వం ఎలా ఉంటుందో చూపిద్దాం.' అని పవన్ పేర్కొన్నారు.ఇది పండుగ చేసుకునే సమయం కాదని.. బాధ్యతతో ఉండాల్సిన సమయమని పవన్ కల్యాణ్ అన్నారు. చట్టాలను చేసేవాళ్లు ఎలా ఉండాలో చూపిద్దామని.. పార్లమెంటుకు వెళ్లేది ప్రజల కోసం పని చేయడానికే అని గుర్తుంచుకోవాలన్నారు. రక్తం ధారబోసిన జనసైనికులు, వీర మహిళలు పార్టీని గెలిపించారని చెప్పారు. 'కేంద్రంలో కీలకం కాబోతున్నాం. ఎంపీలు ఉదయ్, బాలశౌరికి చాలా బాధ్యత ఉంది. ఢిల్లీ జనసేన ఎంపీల కదలికలను ప్రతి ఒక్కరూ పరిశీలిస్తారు. జాగ్రత్తగా ఉండాలి. ఇది అద్భుత విజయం. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ గెలవడం చారిత్రాత్మక విజయం.' అని పవన్ పేర్కొన్నారు. ఇప్పుడు ఎంత బాధ్యతగా ఎలా పని చేశామో.. అంతకు మించిన స్థాయిలో ఇక నుంచి కూడా పార్టీ కోసం పని చేయాలని జనసేన నేత నాదెండ్ల మనోహర్ సూచించారు.

## విధ్వంసానికి గురైన ఎపిని
# గాడిలో పెడతాం

మొదటిపేజీ తరువాయి..

మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఈ ఐదేళ్ల తరహా ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. ఐదేళ్లలో వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయని చెప్పారు. సహజ సంపద విచ్చలవిడిగా దోచుకున్నారన్నారు. తాము మిగులు విద్యుత్ తీసుకొస్తే వైకాపా నాశనం చేసింది. 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచేసి ప్రజలపై భారం మోపారని వివరించారు.వైకాపా పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ఎలా ఇబ్బంది పడ్డాయో చూశాం. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలన్నదే మా ధ్యేయం. భావితరాల భవిష్యత్తు కోసం ముందుకెళ్లాం. రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదు. దేశం, ప్రజాస్వామ్యం, పార్టీలు శాశ్వతం. పార్టీలు కూడా సక్రమంగా పనిచేస్తే మళ్లీ ప్రజలు ఆదరిస్తారు. ఇంత చరిత్రాత్మకమైన ఎన్నికలు ఎప్పుడూ చూడలేదు. అమెరికాలో ఉండే వ్యక్తి కూడా తపనతో వచ్చి పనిచేశారు. పక్క రాష్ట్రాల్లో కూలీ పనులకు వెళ్లిన వ్యక్తులు కూడా వచ్చి ఓటు వేశారు. తెదేపా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఎన్నికలు ఇవి. ఎన్టీఆర్ పార్టీ పెట్టినపుడు 1983లో 200 సీట్లు వచ్చాయి. మళ్లీ ఇప్పుడు ఊహించని విధంగా ఫలితాలు వచ్చాయి. కూటమికి 55.38 శాతం ఓట్లు వచ్చాయి. 45.60 శాతం తెదేపాకు, 39.37 శాతం వైకాపాకు వచ్చాయి. అవినీతి, అరాచకాలతో పనిచేసినందునే ఆ పార్టీకి ఇలాంటి గతి పట్టింది. మూడు పార్టీలు ఉమ్మడిగా కలసికట్టుగా పోరాడాయని అన్నారు. అలాగే పవన్ కళ్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదన్న సంకల్పంతో పనిచేశారని అందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఐదేళ్లూ మా కార్యకర్తలు చాలా మంది ఇబ్బంది పడ్డారు. వారు కంటినిండా నిద్రపోలేదు. ప్రాణాలతో ఉండాలంటే జై జగన్ అనాలని హింసించారు. జై తెలుగుదేశం.. జై చంద్రబాబు అంటూ ప్రాణాలు వదిలిన పరిస్థితిని చూశాం. కార్యకర్తల త్యాగాల ఫలితమే ప్రజాస్వామ్యాన్ని కాపాడింది. మీడియా కూడా ఐదేళ్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. ప్రజాస్వామ్యమే సిగ్గుతో తల దించుకునే ఘటనలు జరిగాయి. ఎవరినైనా.. ఏదైనా చేయొచ్చని దాడులు చేశారు. విశాఖపట్నం వెళ్తే జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను వెనక్కి పంపించేశారు. కేసులు ఎందుకు పెట్టారని ఎవరైనా అడిగితే అరెస్ట్ చేశారు. మేం పాలకులం కాదు.. సేవకులమని పనిచేస్తాం. మా ఎన్నికల మ్యానిఫెస్టో ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలడానికి వీల్లేదని పవన్ పట్టుబట్టారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన కృషి చేశారు. పవన్‌తో పాటు కూటమిలో భాజపా భాగస్వామ్యమైంది. ఎలాంటి పొరపాటు లేకుండా మేమంతా కలిసి పనిచేశాం. ఎన్డీయేలో భాగస్వాములుగా బాధ్యతతో ముందుకెళ్లాం. సమష్టి కృషితోనే అనూహ్య విజయం సాధించగలిగాం అని చంద్రబాబు చెప్పారు.

# మోదీకి రాజకీయ, నైతికంగా పరాజయమే

మొదటిపేజీ తరువాయి..

ప్రజల హక్కులను హరించే రాజకీయాలకు తగిన సమాధానం ఇచ్చిందని అన్నారు. ఇది ప్రధాని మోదీ రాజకీయ, నైతిక పరాజయమని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈరోజు ఇండి కూటమిలోని పార్టీల నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నుంచి మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, డీఎంకే నుంచి స్టాలిన్, సమాజ్‌వాద్ పార్టీ నుంచి అఖిలేష్ యాదవ్ ఆర్జేడీ నుంచి తేజస్వి యాదవ్, ఆప్ నుంచి రాఘవ్ చద్దా, ఎన్సీపీ నుంచి శరద్ పవార్, సుప్రియా సూలే, శివసేన( యూబీటీ) సంజయ్ రౌత్, సీపీఐ నుంచి డీ రాజా.. తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం ఇండి కూటమి నేతలు ప్రకటన విడుదల చేశారు. మోదీ ప్రభుత్వంలోని ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, క్రోనీ క్యాపిటలిజానికి వ్యతిరేకంగా భారత రాజ్యాంగాన్ని రక్షించడం కోసం ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని అన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ఇండి కూటమి పోరాటాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వంలా కాకుండా ప్రజల ఆకాంక్షను సాకారం చేసేందుకు సరైన సమయంలో తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. "ఇండి కూటమిలోని స్నేహితులందరికీ నేను స్వాగతం పలుకుతున్నాను. కలిసికట్టుగా పోరాడాం..సమన్వయంతో పోరాడాం.. పూర్తి శక్తితో పోరాడాం.. మీ అందరికీ అభినందనలు!. 18వ లోక్‌సభ ఎన్నికల ప్రజాభిప్రాయం నేరుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా ఉంది. బీజేపీ ఈ ఎన్నికలలో ఆయన పేరు మీద ముందుకు వెళ్లింది. అయితే బీజేపీకి మెజారిటీ ఇవ్వలేదు. మోదీకి వ్యక్తిగతంగా ఇది రాజకీయ ఓటమి మాత్రమే కాదు నైతిక పరాజయం కూడా. ఈ ప్రజాభిప్రాయాన్ని తిరస్కరించేందుకు వారు అన్ని విధాలా కృషి చేస్తారు.. ఇది వారికున్న అలవాటు అని అందరికి తెలుసు. భారత రాజ్యాంగంపై అచంచల విశ్వాసం, ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయ లక్ష్యాలకు కట్టుబడి ఉన్న అన్ని రాజకీయ పార్టీలను ఇండి కూటమి స్వాగతిస్తుందని మేము ఈ వేదిక నుంచి తెలియజేస్తున్నాం" అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత కొద్దిసేపటికి సీపీఐ నేత డీ రాజా మాట్లాడుతూ.. ఇండి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేయదని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో చర్చలు జరుపుతున్నారా? అని ప్రశ్నించగా.. "ఎవరు చెప్పారు? ఇదంతా ఎవరు మాట్లాడుతున్నారో నాకు తెలియదు..." అని చెప్పారు. "మేము ప్రస్తుత పరిస్థితులపై చర్చించాము. సమావేశంలో ఆమోదించిన ప్రకటనను ఖర్గే చదివి వినిపించారు. మల్లికార్జున్ ఖర్గే ఇండి కూటమికి చైర్‌పర్సన్‌గా ఉన్నారు" అని రాజా చెప్పారు.

# ప్రజలు లేకుండా జగన్ పాలన

మొదటిపేజీ తరువాయి..

అని పేర్కొన్నారు. ప్రజలు మంచి చేసిన ప్రభుత్వాలకే తోడుగా ఉంటారన్నారు. చెడు చేసిన వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారన్నారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల సంపదను దోచేసి ధనవంతులయ్యారని యనమల పేర్కొన్నారు. జగన్ దోపిడీ పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. వైసీపీ ఓటమికి జగన్ ఆకృత్యాలు, అవినీతి, దోపిడీలే కారణమన్నారు. జగన్ పరిపాలనకు, ప్రతిపక్షానికి కూడా అనర్హుడని ప్రజలు తేల్చారని యనమల పేర్కొన్నారు. ఐదేళ్లలో వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయని చెప్పారు. సహజ సంపద విచ్చలవిడిగా దోచుకున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచేసి ప్రజలపై భారం మోపారని వివరించారు. వైకాపా పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ఎలా ఇబ్బంది పడ్డాయో చూశామన్నారు. ప్రజలు గెలవాలి..



రాష్ట్రం నిలబడాలన్నదే తెలుగు దేశం ధ్యేయం. రాజకీయాల్లో ఎవరూ శాశ్వతం కాదని, అయితే తాను శామాత్రం శాశ్వతం అని జగన్ ఊహించుకున్నారని అన్నారు. దేశం, ప్రజాస్వామ్యం, పార్టీలు శాశ్వతం. పార్టీలు కూడా సక్రమంగా పనిచేస్తే మళ్లీ ప్రజలు ఆదరిస్తారు. ఇంత చరిత్రాత్మకమైన ఎన్నికలు ఎప్పుడూ చూడలేదు. తెదేపా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఎన్నికలు ఇవని అన్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# సెంటిమెంట్‌కు చెక్ పెట్టిన మార్కాపురం ప్రజానీకం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 5)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టువదలని విక్రమార్కుడు...జరుగుతున్న రాజకీయ చదరంగంలో కూడా నేనెప్పుడు పార్టీ మారడం కానీ, నమ్మిన పార్టీకి ద్రోహం చేయడం కాని చేయలేదు. గత 20 సంవత్సరాలుగా క్రమ శిక్షణ గల పార్టీ కార్యకర్తగా, నాయకునిగా ఎదిగారు. చంద్రబాబునాయుడుకు అత్యంత సన్నిహితుడయ్యాడు. తెలుగుదేశం పార్టీనే నమ్ముకుని తెలుగుదేశం పార్టీనే ఊపిరిగా 20 ఏళ్ళ నుంచి పార్టీ కోసం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. రాజకీయంగా దెబ్బలు తిన్నారు. అయినా రాటుతేలారే తప్ప ఎప్పుడు తప్పటడుగు వేయలేదు. ఈ క్రమంలోనే 2009వ సంవత్సరంలో మార్కాపురం ఎమ్మెల్యేగా టీడీపీ తరుపున పోటీ చేసి గెలుపొందారు. అయితే అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో నియోజకవర్గ ప్రజలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోయారు. అయితే ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డితో పోరాడి నియోజకవర్గానికి రావాల్సిన నిధులను రాబట్టి అభివృద్ధికి బాటలు వేశారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో నారాయణరెడ్డి ఓటమి పాలయ్యారు. దీంతో టీడీపీలోకి అధికారంలోకి వస్తే నారాయణరెడ్డి ఓడిపోతారని, నారాయణరెడ్డి గెలిచినపుడు ఆ పార్టీ అధికారంలో ఉండదని నియోజకవర్గ ప్రజల్లో పెద్ద చర్చ ఉండేది. అయితే వాటన్నింటికి భిన్నంగా మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నారాయణరెడ్డి మంచి మెజార్టీతో మార్కాపురం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇదే క్రమంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి భారీ సీట్లతో అధికారంలోకి వచ్చింది. దీంతో నారాయణరెడ్డి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి బాటలో పయనింపజేసేందుకు మంచి అవకాశం దొరికిందని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

**సెంటిమెంట్‌కు చెక్ పెట్టిన మార్కాపురం ప్రజానీకం**

కందుల నారాయణరెడ్డి 20 ఏళ్ళ రాజకీయ ప్రస్తానంలో కనీవినీ ఎరుగని రీతిలో మార్కాపురం నియోజకవర్గ ప్రజలు సెంటిమెంట్‌కు చెక్ పెట్టారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన సమయంలోనే మార్కాపురంలో కందుల నారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారు.

## కందుల గెలిస్తే పార్టీ అధికారంలోకి రాదు...
## పార్టీ అధికారంలోకి వస్తే కందుల గెలవడు..
## ఇదీ నిన్నటి వరకు మార్కాపురంలో చర్చ
## నేడు ఆ చర్చకు ఫులిస్టాప్...
## తొలి సారిగా కందుల గెలిచి... పార్టీ అధికారంలోకి వచ్చి...

దీంతో రెండు చోట్ల అధికారం రావడంతో కందులకు తిరుగుండదని, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తారని ప్రజలు చెబుతున్నారు.

**మార్కాపురం జిల్లా ఏర్పాటు ఖాయం**

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మార్కాపురం ఇటీవల రెండు సార్లు వచ్చిన సమయంలో ప్రతీ సారి కూడా మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేయడంలో అధికార పార్టీ ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేసింది. తాము అధికారంలోకి రాగానే పశ్చిమ ప్రాంతాన్ని కలుపుతూ మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేస్తామని బహిరంగంగానే చెప్పారు. అయితే ఈ మాటను నియోజకవర్గ ప్రజలు కూడా పూర్తిగా స్వాగతించినట్లు కనిపిస్తుంది.

పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. అపారమైన వనరులున్నాయి. అయినప్పటికీ జిల్లా ఏర్పాటు కాకపోవడంతో ప్రజలు వెనుకబాటుకు గురవుతున్నారు. జిల్లా ఏర్పాటు జరిగితేనే ఖచ్చితంగా అభివృద్ధి జరుగుతుంది. అభివృద్ధి జరగాలంటే నారాయణరెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నియోజకవర్గంలోని ప్రజలందరూ పార్టీలకు అతీతంగా ఒక్కటయ్యారు. ధన బలానికి సేవకు మధ్య జరిగిన ఎన్నికల్లో సేవకునికి పట్టం కట్టారు. వైసీపీ నోటు తీసుకుని కూటమి కి ఓటు వేసి నారాయణరెడ్డిని గెలిపించుకున్నారు.

**కలిసొచ్చిన వెలిగొండ ప్రాజెక్టు**

నారాయణరెడ్డి గెలుపుకు వెలిగొండ ప్రాజెక్టు కూడా కలిసొచ్చింది. ప్రాజెక్టును పూర్తి చేయకుండానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆర్భాటం గా ప్రాజెక్టును ప్రారంభించారు. ఇది కూడా రైతాంగాన్ని మోసం చేయడమేనంటూ నారాయ ణరెడ్డి ఎలుగెత్తి చాటారు. రైతాంగాన్ని ఆకట్టుకోగలిగారు. ఈ క్రమంలో రైతాంగం మద్దతు కూడా భారీ స్థాయిలో పార్టీలకు అతీతంగా నారాయణరెడ్డిని వరించింది.

**కలిసొచ్చిన పాదయాత్ర**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం మార్కాపురం నూతన జిల్లాగా ఏర్పాటు చేయాలని, బడ్జెట్ లో రూ.3500 కోట్లు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరుతూ నారాయణరెడ్డి చేసిన పాదయాత్ర ఇటు నియోజకవర్గ ప్రజల్లోనే కాక టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దగ్గర సైతం నారాయణరెడ్డికి మైలేజీ పెంచింది. ఒక దశలో ఆర్థికంగా పరిపుష్టి లేని నారాయణరెడ్డిని తప్పించి వేరే అభ్యర్థికి ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని అధినేత చంద్రబాబునాయుడు ఆలోచించారు. టిక్కెట్ విషయంలోనూ తీవ్ర జాప్యం చేశారు. సర్వేల పై సర్వేలు చేయించుకున్నారు. ఎన్ని సర్వేలు చేసినా నారాయణరెడ్డికే అవకాశం ఉండడంతో చివరి నిమిషంలో ఎమ్మెల్యే టిక్కెట్టు కందుల నారాయణరెడ్డికే దక్కింది. ఒక వైపు రోడ్డు ప్రమాదానికి గురై సరిగ్గా నడవలేని నిస్సహాయ స్థితిలో ఉన్నప్పటికీ పక్కా ప్రణాళికలు వేసుకుని ప్రత్యర్థుల ఎత్తుల పై ఎత్తులు వేసుకుంటూ నారాయణరెడ్డి ముందుకు సాగి 13,979 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా రెండో సారి విజయ ఢంకా మోగించారు.

# శ్రీవారి ఆశీస్సులు అందుకున్న వేమిరెడ్డి దంపతులు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 5)**

నెల్లూరు ఎంపీగా విజయం సాధించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం తిరుమలకు చేరుకున్న వారు... శ్రీవారిని దర్శించుకుని స్వామివారి ఆశీసులు అందుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ పి.రూప్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వాదం అందించి శ్రీవారి స్వామి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీవారికి 101 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు.



# కనిగిరిలో " ఉగ్ర "కు క్రాస్ ఓటింగ్

## ఎంపి మాగుంట కన్నా 11,000 ఓట్లు అధికం
## క్రాస్ ఓటింగ్ పై కనిగిరిలో జోరుగా చర్చ






**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 5)**

కనిగిరిలో క్రాస్ ఓటింగ్ ఎక్కువగా జరిగింది. టీడీపీ ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి కంటే కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు 11,000 ఓట్లు అధికంగా పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రకు పోస్టల్ బ్యాలెట్లు 1742తో కలిపి 1,07,045 ఓట్లు వచ్చాయి. వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌కు 92,448 ఓట్లు వచ్చాయి. ఎంపి మాగుంటకు 97,424 ఓట్లు రాగా వైసీపీ ఎంపి అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కనిగిరి నియోజకవర్గంలో 93,820 ఓట్లు వచ్చాయి. కనిగిరిలో ఎంపి మాగుంటకు 3,604 ఓట్ల మెజార్టీ వచ్చింది. కనిగిరి ఎమ్మెల్యే గా డాక్టర్ ఉగ్రకు 14,604 మెజార్టీ రావడం జరిగింది. 11,000 క్రాస్ ఓటింగ్ జరగడం కనిగిరిలో చర్చనీయాంశమైంది. డాక్టర్ ఉగ్ర కనిగిరిలో అన్నా క్యాంటీన్ నిర్వహిస్తుండడం, పేదలకు ఉచితంగా కంటి వైద్య శిబిరాలు పెడుతుండడంతో వైసీపీకి చెందిన 11,000 మంది ఓటర్లు డాక్టర్ ఉగ్రకు ఓటు వేయడం జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కనిగిరి పట్టణంలో ఆర్యవైశ్యులు 95 శాతం మంది డాక్టర్ ఉగ్రకు ఓటు వేసినట్లు తెలుస్తుంది. బిసి వర్గాలు కూడా డాక్టర్ ఉగ్రకు మద్ధతుగా నిలవడం గమనార్హం. పట్టణంలో ప్రధాన సమస్య అయిన నీటి సమస్య నివారణే తన ముందున్న లక్ష్యమని డాక్టర్ ఉగ్ర షణ్ముఖ వెలుగు ప్రతినిధికి తెలిపారు.

**కార్యకర్తలకు అండగా ఉంటా....** తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన టీడీపీ కార్యకర్తలకు తన వ్యక్తిగత అభిమానులకు అండగా ఉంటానని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక అమరావతి గ్రౌండ్‌లో తనను అభినందించేందుకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో టీడీపీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. కనిగిరి నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమన్నారు. మీ అందరి సహాయ సహకారాలతో కనిగిరిని అభివృద్ధి చేస్తానన్నారు. డాక్టర్ ఉగ్రను అభినందించేందుకు ఆరు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పామూరు రోడ్డులోని అమరావతి గ్రౌండ్ ప్రాంగణంలో టీడీపీ శ్రేణులతో కిక్కిరిసిపోయింది.

# కందులకు అభినందనలు తెలిపిన షణ్ముఖ వెలుగు దినపత్రిక ఎడిటర్ రాధాకృష్ణ



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 5)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని బుధవారం పొదిలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో షణ్ముఖ వెలుగు దినపత్రిక ఎడిటర్ ఓబులశెట్టి రాధాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), కొనకనమెట్ల మండలం విశాలాంధ్ర విలేఖరి పిచ్చయ్య , తదితరులు ఉన్నారు.

# నా లక్ష్మణుడు నా సోదరుడే



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

(తరువాయి 4లో...)

## నా లక్ష్మణుడు నా సోదరుడే

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 5)**

తమ్ముడంటే అందరికీ గుర్తొచ్చేది లక్ష్మణుడు... నాకు మాత్రం నా తమ్ముడు గిరిధర్‌రెడ్డి గుర్తుకు వస్తాడని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భావోద్వేగం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నగా నేను చేసింది ఎంతో తెలియదు కానీ... నాకు సమస్తం చేసింది నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అని గుర్తు చేసుకున్నారు. తల్లిదండ్రులు, భార్యా, బిడ్డల కంటే తమ్ముడు గిరిధర్ అంటే తనకు ఎంతో ప్రాణమన్నారు. నా అండదండ, నా తోడునీడ, నా సోదరుడేనని చెప్పేందుకు ఎంతో గర్విస్తున్నానన్నారు. ఇలాంటి తమ్ముడు తనకు దేవుడిచ్చిన వరమన్నారు.

# వరికుంట్ల అనీల్ ఆధ్వర్యంలో ఘనంగా కందుల విజయోత్సవ వేడుకలు








**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 5)**

పట్టణంలోని పందు స్నేహ చికెన్ సెంటర్‌ల అధినేత, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పొదిలి చిన్నబస్టాండ్ సెంటర్‌లో మార్కాపురం ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి విజయోత్సవ సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంచేపల్లి గ్రామ కార్యకర్తలు, నాయకులు జైజై చంద్రబాబు, జైజై కందుల అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అనిల్‌కు తినిపించారు. అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన ఆంధ్రప్రదేశ్ కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలకు శుభాకాంక్షలుతెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి, కుంచేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నింగినంటిన సంతోషం... కార్యకర్తల కోలాహలం...

## కందులకు బ్రహ్మరథం పట్టిన టీడీపీ నేతలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 5)**

మార్కాపురం నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలిచిన కందుల నారాయణరెడ్డి తొలిసారి బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డిని కలవడానికి కార్యకర్తలు పోటీపడ్డారు.

ఈ సందర్భంగా వారు పూల బొకేలు, పూలమాలలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంచుకుంటు నారాయణరెడ్డితో సెల్ఫీలు దిగేందుకు క్యూ కట్టారు. కందుల నారాయణరెడ్డి ప్రతి కార్యకర్తను అప్యాయంగా పలుకరిస్తు విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరి కృతజ్ఞతలు తెలిపారు.



















# మొక్కులు తీర్చుకున్న తెలుగు తమ్ముళ్లు

## కందుల భారీ మెజార్టీతో గెలిచినందుకు పొదిలి శివాలయంలో 101 టెంకాయలు కొట్టిన తమ్ముళ్లు

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 5)**
ఎన్డీఏ కూటమి విజయం సాధించినందుకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా పొదిలి శివాలయంలో టెంకాయల మోత మోగించారు తెలుగుదేశం తమ్ముళ్లు. మార్కాపురం తెలుగుదేశం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి అత్యధిక భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా స్వామివారికి తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మా నాన్నగారిని అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు అని కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి తెలిపారు. మా నాన్న మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతారు. ఏ కష్టం వస్తే మీ ముందు నిలబడతాడని కందుల విగ్నేష్‌రెడ్డి వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం యువ నాయకులు షేక్ కాలేషా, గురిజాల నవీన్, కాటూరి శీను, రబ్బాని, జమీర్, రవి, తదితరులు పాల్గొన్నారు.





## కొండపి ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి స్వామికి శుభాకాంక్షలు



**(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, జూన్ 5)**
కొండపి ఎమ్మెల్యే ఎన్డీఏ కూటమి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామికి ఎమ్మార్పీఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ నాయకత్వం అహర్నిశలు కృషి చేసిందని ప్రకాశం జిల్లా మాదిగ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు గురిజాల నరసింహారావు (బాబురావు) అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే స్వామిని నాయుడుపాలెం తన నివాసంలో కలుసుకొని ఎమ్మార్పీఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మాదిగల గెలుపు ఎన్డీఏ కూటమి గెలుపు నినాదంతో తమ వంతు కృషి చేశామని తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు గురిజాల పోలయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు గురజాల రాజు, గురిజాల కాటయ్య, కొండ్రు జాన్, గురజాల జాన్సన్, గురుజాల సామేలు, తదితరులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లు

### ఘన సత్కారం అందుకున్న వేమిరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 5)**
నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డిని పలు ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూల్స్ స్థితిగతులు తదితరాంశాలపై వేమిరెడ్డితో కాసేపు చర్చించారు. సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు నగరం నుంచి పోటీ చేసిన డాక్టర్ పొంగూరు నారాయణ భారీ మెజారిటీతో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. శిల్ప స్కూల్ అధినేత మల్లికార్జున్ రెడ్డి, అజంతా స్కూల్ , అధినేత వెంకటేశ్వర రెడ్డి, కేబీఆర్ స్కూల్ అధినేత భాస్కర్ రెడ్డి, విద్యోదయ స్కూల్ అధినేత వెంకటాద్రి తదితరులు వేమిరెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

## ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం

### వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 5)**
నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో ప్రజలకు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో అన్ని విధాలామేలు చేసిందన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులకు 4 లక్షల 86 వేల ఉద్యోగాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలు, కొత్తపోర్టులు, గ్రామ వార్డు సచివాలయాలు, ఆర్ బి కే లు, విలేజ్ హెల్త్ క్లినిక్లు, అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్లు, ఇలా అనేక సంస్కరణలతో వైసిపి ప్రభుత్వం ప్రజలకు సేవలు అందించిందన్నారు. అయినప్పటికీ ప్రజలు ఈ ఎన్నికల్లో మార్పు కోరుకుని, రాబోయే ఐదేళ్లు తెలుగుదేశం పార్టీకి అధికారమిచ్చారన్నారు. 40 శాతం మంది ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పార్టీకి అండగా నిలిచారన్నారు. వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఐదేళ్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి పోరాడుతుందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, ప్రజలకు అండగా నిలబడాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ సేవలు అందిస్తుందని తెలిపారు.

## దుర్మార్గపాలన నుంచి రాష్ట్రం విముక్తి

### టీడీపీ జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహ్మద్



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 5)**
దుర్మార్గపాలన నుంచి రాష్ట్రం విముక్తి పొందిందని తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్.రసూల్ మహ్మద్ ఆనందం వెలిబుచ్చారు ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి రికార్డు స్థాయిలో విజయంవైపు దూసుకు పోవడంపై రసూల్ స్పందిస్తూ మంచి జరిగితేనే ఓటు వేయమని అడిగిన జగన్మోహన్ రెడ్డికి ప్రజలు సరైన రీతిలో బదులిచ్చారన్నారు. అన్ని వర్గాల ప్రజలను రాక్షసంగా హింసించిన జగన్‌కు ప్రజలు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమన్నారు. అమరావతి రాజధాని ప్రజలెవ్వరూ సమ్మతంగా లేరని తేలిపోయిందన్నారు. ప్రకాశం జిల్లాలో ముస్లిం ప్రజానీకానికి కొంతమంది మతపెద్దలు సిగ్గులేకుండా వైసీపీ పార్టీకి కొమ్ముకాసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయమని చెప్పినా ముస్లిం సోదరులు మాత్రం సైకిల్ గుర్తుకు గుంపగెత్తుగా ఓట్లు వేసి జిల్లాలో 10 స్థానాల్లో విజయకేతనం ఎగుర వేశారన్నారు. ప్రజావేదిక విధ్వంసంతో పాలన మొదలుపెట్టిన జగన్మోహన్ రెడ్డికి ప్రజలు తమ ఓట్లతో వైసీపీ పార్టీని విధ్వంసం చేశారన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన రాష్ట్రాన్ని చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధి పథంలోకి పయనిస్తుందన్నారు. ప్రజలు విజ్ఞులని, సరైన తీర్పు ఇచ్చి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి సహకరించిన అందరికీ రసూల్ కృతజ్ఞతలు తెలిపారు.

## కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామికి శుభాకాంక్షలు తెలిపిన కొండపి వ్యవసాయశాఖ మాజీ వైస్ చైర్మన్ పులిప్రసాద్ యాదవ్



**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జూన్ 5)**
కొండపి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యేగా ముచ్చటగా మూడో సారి హ్యాట్రిక్ సాధించి విజయ దుందుభి మోగించిన అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితుడు డాక్టర్ శ్రీ డోలాబాల వీరాంజనేయ స్వామిని బుధవారం కొండపి వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పులి ప్రసాద్ యాదవ్ ఎమ్మెల్యే స్వామిని ఆయన నివాస గృహంలో కలిసి మర్యాదపూర్వకంగా శు భాకాంక్షలు తెలిపారు. మూడోసారి ముచ్చటగా హ్యాట్రిక్ సాధించి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర శాసనసభకి ఎన్నికైనందుకు ఎమ్మెల్యే స్వామికి ఆయన పట్ల ప్రత్యేకంగా పులి ప్రసాద్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కొండపి నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో ఎమ్మెల్యే స్వామి ఆధ్వర్యంలో సాగు, తాగు,విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు తదితర అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తాడని ఎమ్మెల్యే స్వామిపై కొండపి వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డ్ వైస్ మాజీ చైర్మన్ పులి ప్రసాద్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే స్వామి సేవలు ఈ నియోజకవర్గ ప్రజానీకానికి ఎంతో అవసరమని పులి ప్రసాద్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు పార్టీ కార్యకర్తలు చేవూరి శ్రీనివాసులు ఎమ్మెల్యే స్వామిని కలిసిన వారిలో ఉన్నారు.

# తాటిపర్తిని కలిసిన వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

### సింగరాయకొండలో ఆయన నివాస గృహంలో భేటి
### మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలవనున్న యర్రగొండపాలెం వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

**(షణ్ముఖ వెలుగు, సింగరాయకొండ, జూన్ 5)**
సింగరాయకొండ మండలం సింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని బుధవారం ఎర్రగొండపాలెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడిగా గెలుపొందిన తాటిపర్తి చంద్రశేఖర రావుని సింగరాయకొండలో ఆయన నివాస గృహంలో మర్యాదపూర్వకంగా బుధవారం ఒంగోలు పార్లమెంటు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి బొకే సమర్పించి శు భాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ఎర్రగొండపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడిగా గెలుపొందినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తాటిపర్తి చంద్రశేఖర రావును బుధవారం కలిసారు. అనంతరం ఇద్దరి మధ్య రాష్ట్ర రాజకీయ స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఇద్దరు నేతలు అనంతరం చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఎల్లప్పుడు తాటిపర్తి చంద్రశేఖర రావు కి అండగా నిలుస్తుందని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. నూతనంగా ఎర్రగొండపాలెం



శాసనసభ్యుడిగా ఎన్నికైనందుకు ప్రత్యేకంగా భాస్కర్ రెడ్డి తాటిపర్తి చంద్రశేఖర రావుకి శుభాకాంక్షలు తెలపడమే గాక, ఆయన్ని ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వీలైనంత త్వరలో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాటిపర్తి చంద్రశేఖర రావు కలవబోతున్నట్లు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు.

దీనికి అంగీకరించిన ఎర్రగొండపాలెం వైసీపీ పార్టీ శాసనసభ్యుడు రెండు రోజుల్లోపు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు తాటిపర్తి చంద్రశేఖర రావు అంగీకరించారు.

ఏది ఏమైనప్పటికీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రగొండపాలెం వైసిపి పార్టీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర రావు ఆయన అడుగుజాడల్లో నడుచుకోవడమే గాక వైఎస్ జగన్మోహన్ రెడ్డి సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారని ఎర్రగొండపాలెం నియోజకవర్గ తరఫున నూతనంగా శాసనసభ్యుడిగా ఎన్నికైన తాటిపర్తి చంద్రశేఖర రావు అన్నారు.

# కంగ్రాట్స్ నారాయణ మాస్టార్







**డాక్టర్ పొంగూరు నారాయణ నివాసం జన కోలాహలం**
**భారీగా తరలివచ్చిన ముఖ్యనేతలు, కూటమి శ్రేణులు, ప్రజలు**
**డాక్టర్ నారాయణను సన్మానాలతో ముంచెత్తిన అభిమానులు**
**అందరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేసిన డాక్టర్ పొంగూరు నారాయణ**







**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 5)**

2024 సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన డాక్టర్ పొంగూరు నారాయణ నివాసం పార్టీ శ్రేణులు, అభిమానులతో జన కోలాహలంగా మారిపోయింది. ఉదయం నుంచి పలువురు ముఖ్యనేతలు, ప్రజలు, వేలాది మంది అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ క్యాడర్‌లతో భారీ సందడి నెలకొంది. గత మూడు దశాబ్దాల తర్వాత తొలిసారిగా నెల్లూరు సిటీలో టీడీపీ జెండా ఎగరడంతో పాటు జిల్లా మొత్తం క్లీన్ స్వీప్ కావడంతో కూటమి శ్రేణులు ఆనందోత్సవాల్లో ఉన్నారు. ఈ క్రమంలో 72,489 ఓట్ల అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన మాజీ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను కలిసి అభినందనలు తెలియజేందుకు భారీగా ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. శాలువాలు, పూలమాలలు, భారీ గజమాలలు, బొకేలు, జ్ఞాపికలు, స్వీట్స్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ముఖ్య నేతలంతా విచ్చేసి భారీ కేక్‌లను కట్ చేసి కంగ్రాట్స్ నారాయణ సార్ అంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. విచ్చేసిన కూటమి కేడర్‌ను, అభిమానులను నారాయణ పేరుపేరున పలకరించారు. తన విజయానికి కృషి చేసిన వారందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. అభిమానుల తాకిడితో నారాయణ నివాసం జనసంద్రమైంది.

# పోటెత్తిన జనాభిమానం








**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 5)**

భారీ మెజార్టీతో గెలిపించుకున్న దామచర్ల జనార్దన్ రావును కలిసేందుకు ఒంగోలు నియోజకవర్గం ప్రజలు, టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయం చేరుకుని తమ అభిమాన నేత జనార్దన్ రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కష్టపడి పనిచేసినందుకు అభినందించి జనార్దన్ వారితో ఫోటోలు దిగారు.

# ఒంగోలు పార్లమెంటు ప్రజలకు కృతజ్ఞతలు మాగుంట



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 5)**

2024 సాధారణ ఎన్నికలలో నన్ను - నా సహచర అసెంబ్లీ అభ్యర్థులను ఆదరించి తెలుగుదేశం, జనసేన, బీ.జే.పి. పార్టీలకు - మాకు అఖండ విజయాన్ని చేకూర్చిన ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ఓటరు మహాశయులకు, ప్రజలందరకు కృత్ఙతలు తెలియజేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్ష్యులు, పవన్ కళ్యాణ్, భారతీయ జనతా పార్టీ నాయకులు, ప్రధాన మంత్రి, నరేంద్ర మోదీ కలసి కూటమిగా ఏర్పడి పోటీ చేసిన 2024 సార్వత్రిక ఎన్నికల కార్యక్రమాల్లో ఎండనక, రాత్రిళ్ళనక పాల్గొని, మమ్ములను ఆదరించి, విశేష కృషి చేసి, నాకు - నా సహచర అసెంబ్లీ అభ్యర్థులు, ఒంగోలుకు దామచర్ల జనార్ధన్ రావుకి, కొండపికి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామికి, కనిగిరికి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి, గిద్దలూరుకు ముత్తుముల అశోక్ రెడ్డికి , మార్కాపురానికి కందుల నారాయణ రెడ్డికి అఖండ విజయాన్ని అందించినందుకు పార్లమెంటు ఓటరు మహాశయులకు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, మాగుంట అభిమానులకు, శ్రేయోభిలాషులకు, ఉద్యోగులకు, ప్రజలకు పేరు పేరున నేను నా సహచర అసెంబ్లీ అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీల సహకారంతో రాష్ట్రాభివృద్ధితోపాటు ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నేను నా సహచర శాసనసభ్యులు తప్పక కృషి చేస్తామని మాగుంట తెలిపారు.

# కందుల ఇంటికి పోటెత్తిన అభిమానులు

**కందులకు శుభాకాంక్షలు తెలిపిన**
**మార్కాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాధ్**







**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 5)**

మార్కాపురం పట్టణంలో 2024 సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి గెలిచిన విషయం విధితమే. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గ జనసేన ఇంచార్జి ఇమ్మడి కాశీనాథ్ కందులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత శాలువా కప్పి, పూల మాల వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడి కాశీనాథ్ వెంట పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా రెండోసారి గెలిచిన కందుల నారాయణరెడ్డి ఇంటికి బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటెత్తారు. ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరారు. దీంతో ఆయన ఇంటి ఆవరణలో కోలాహలం నెలకొంది. ముందుగా ఉదయం మార్కాపురంలో వెళ్తున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారిని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దాదాపు 15 ఏళ్ల తర్వాత మార్కాపురంలో టీడీపీ జెండా ఎగరడంతో ఆ పార్టీ శ్రేణులు ఉత్సాహంతో పాల్గొన్నారు.



# గోడౌన్‌కు ఈవీఎంల తరలింపు

## కలెక్టర్ ఎం హరి నారాయణన్ ఆధ్వర్యంలో గోడౌన్‌కు సీలు





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 5)**

2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన సందర్భంగా ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలను నెల్లూరు నగరంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచే గోడౌన్‌కు తరలించారు. బుధవారం సాయంత్రం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ గోడౌన్‌లో ఈవీఎంలను భద్రపరిచి సీలు వేశారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మలోల, ప్రేమ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రీనివాస్, రసూల్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బరువు తగ్గాలంటే కిస్‌మిస్‌ని ఇలా తీసుకోండి..



ద్రాక్షల్ని ఎండబెట్టి ఎండుద్రాక్షలు తయారుచేస్తారు. వీటిని తినడం వల్ల ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ వస్తాయి. మలబద్ధకంతో బాధపడేవారు నానబెట్టి ఎండుద్రాక్షల్ని తినడం మంచిది. ఇందులో పీచు పదార్థం జీర్ణక్రియ ప్రక్రియని స్పీడ్ అప్ చేస్తుంది. దీంతో పాటు ఎండుద్రాక్ష నీటిని తాగితే బరువు కూడా తగ్గుతారు.

**ఎండుద్రాక్షలోని పోషకాలు..**ఎండు ద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మీ కణాలను హానికరమైన పదార్థాల నుండి రక్షిస్తాయి. ఎండుద్రాక్షలో ఫెరులిక్ యాసిడ్, రుటిన్, క్వెర్సెటిన్, ట్రాన్స్ కాఫ్టారిక్ యాసిడ్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇది లెప్టిన్, గ్రెలిన్ వంటి సమ్మేళనాలు కలిగి ఉంటుంది. ఇది కోరికలను నియంత్రించడంలో సాయపడుతుంది. ఇది శరీరంలో రక్తంలో చక్కెరని అదుపులో ఉంచుతాయి. కేలరీలను తీసుకోవడాన్ని తగ్గిస్తుంది. ఇది త్వరగా బరువు తగ్గడానికి సాయపడుతుంది.

బరువు తగ్గేందుకు నట్స్‌ని ఎలా తీసుకోవాలి..

**ఇన్సులిన్ స్థాయిలు..**ఎండుద్రాక్షలో సహజ చక్కెర తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సాయపడుతుంది. భోజనం తర్వాత ఎండుద్రాక్ష తినడం వల్ల ఇన్సులిన్ నియంత్రణలో ఉంటుంది. అలాగే, గ్లైసెమిక్ ఇండెక్స్ బ్యాలెన్స్ మెంటెయిన్ చేయడంలో సాయపడుతుంది.



**రక్తహీనతకి చెక్..**ఎండుద్రాక్షలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరంలో ఎర్ర రక్తకణాలు ఏర్పడడానికి సాయపడుతుంది. ప్రతిరోజూ ఎండుద్రాక్ష నీటిని తీసుకుంటే శరీరంలో ఐరన్ లోపం తగ్గుతుంది. ఇది రక్తహీనతని దూరం చేయడానికి సాయపడుతుంది. ఎండుద్రాక్ష నీటిలోని సహజ లక్షణాలు శరీరాన్ని క్లీన్ చేస్తాయి. ఇది సహజ డీటాక్సీఫైయర్‌గా పనిచేస్తుంది. దీనిని తీసుకుంటే టాక్సిన్స్ దూరమవుతాయి.

**జీర్ణ వ్యవస్థకి..**ఎండుద్రాక్షలో సహజ తీపి ఉంటుంది. ఇది హెల్దీ స్నాక్ కూడా. మీకు కడుపులో యాసిడ్ సమస్య ఉంటే ఎండుద్రాక్ష నీటిని తాగడం మంచిది. ఇందులో ఫైబర్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి పేగులని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడుతుంది. ఇది జీర్ణక్రియ ప్రక్రియని స్పీడ్‌అప్ చేస్తుంది.

**ఎంత తీసుకోవాలి..**ఓ గిన్నె తీసుకుని 2 కప్పుల నీటిని మరిగించాలి. అందులో 15 నుంచి 30 నిమిషాల పాటు ఎండుద్రాక్ష వేసి రాత్రంతా నానబెట్టండి. ఉదయాన్నే నీటిని వడపోసి వేడి చేయండి. ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగండి. ఇందులో కొద్దిగా నిమ్మరసం వేయండి. తర్వాత 30 నిమిషాల వరకూ ఏం తినకూడదని గుర్తుంచుకోండి.

# వారానికి రెండుసార్లైనా అరటి కాండం గుజ్జుని తీసుకుంటే ఈ సమస్యలన్నీ దూరం..

అరటిపండులో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. అరటిపండులోని ప్రతి భాగంలో అద్భుత గుణాలు ఉన్నాయి. ఇవన్నీ ఆరోగ్యానికి మంచి చేసేవే. ఇందులో భాగంగా నేడు అరటి కాండం గురించి తెలుసుకోండి.



**అరటి కాండంలోని పోషకాలు..**అరటి కాండంని తీసుకుంటే జీర్ణ వ్యవస్థ నుంచి అసిడిటీ వరకూ చాలా సమస్యలు దూరమవుతాయి. అరటిపండులో పొటాషియం, విటమిన్ బి6, మెగ్నీషియం, విటమిన్ సి, కాపర్, ఐరన్, మాంగనీస్, కార్బోహైడ్రేట్స్, ఫైబర్స్, ఇతర ఖనిజాలు, సూక్ష్మ పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ రుచిని అందరికీ నచ్చదు. అందుకే, ఎక్కువగా తినరు.

**చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించడం..** నివేదికల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ కేసులలో మూడింట ఓ వంతు హై కొలెస్ట్రాల్ వల్ల వస్తుంది. అరటిపండు కాండంలో కొలెస్ట్రాల్ స్థాయిలను సమర్థవంతంగా నిర్వహించడంలో సాయపడుతుంది. ఇది ఐరన్, బి6 కి గొప్ప మూలం. ఇది హిమోగ్లోబిన్ కౌంట్‌ని పెంచడంతో పాటు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కీ రోల్ పోషిస్తుంది.



**రక్తపోటు తగ్గడం..**ధమనుల గోడలపై ఒత్తిడి అసాధారణంగా ఉన్నప్పుడు అధిక రక్తపోటు ఏర్పడుతుంది. అధిక రక్తపోటు స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. అరటి కాండంలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటులో హెచ్చుతగ్గులని బ్యాలెన్స్ చేస్తుంది. గుండె సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్‌తో చాలా మంది ఎఫెక్ట్ చేస్తుంది. ఇది అంటువ్యాధి అనుకోవచ్చు. యూటిఐలు తరచుగా యోని ఇన్ఫెక్షన్స్‌కి దారితీస్తాయి. ప్రధానంగా జీర్ణవ్యవస్థలో ఉద్భవించే వ్యాధికారక కారకాల వల్ల వస్తాయి. అరటి కాండం రసంలో మూత్రవిసర్జన లక్షణాలు ఉన్నాయి. కాబట్టి, శరీరంలోని ట్యాక్సిన్‌ని బయటికి పంపి మూత్ర నాళాన్ని శుభ్రపరచడానికి సాయపడుతుంది. కాబట్టి, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ రాకుండా ఉండాలంటే వారానికి మూడుసార్లు అరటికాండం జ్యూస్ తీసుకోవడం మంచిది.

**ఇతర బెనిఫిట్స్..**అరటి కాండం శరీరాన్ని చల్లబరుస్తుంది. ఇది కడుపు సమస్యలు, యాసిడ్ రిఫ్లక్స్, ఉబ్బరం వంటి లక్షణాలను మెరుగ్గా చేస్తుంది. ఇది మహిళల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల %ఢ్పుంఐ%, అధిక రుతు రక్తస్రావ, వైట్ డిశ్చర్జ్, వంటి మహిళల ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ప్రెగ్నెన్సీ టైమ్‌లో ఆడవారికి ఇది బెస్ట్ ఫుడ్. ఇందులో ఎక్కువగా ఫైబర్ ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల మలబద్ధకం, పైల్స్, ఫిషర్స్ వంటివి దూరమవుతాయి. దీనిని తీసుకుంటే బరువు కూడా తగ్గుతారు కూడా. దీనిని తినొచ్చు లేదా జ్యూస్‌లా తీసుకోవచ్చు.

# పరగడపున ఈ తప్పులు అస్సలు చేయొద్దు..



పరగడపున పండ్ల రసాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం, దంతక్షయం, జీర్ణక్రియ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. బదులుగా, పోషకాల శోషణ, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడడానికి పండ్ల రసాలను ఇతర సమయాల్లో భోజనంతో పాటు తీసుకుంటారు.

**ఫస్ట్ మీల్..**రోజులో మనం మొదటిసారిగా తీసుకునే భోజనం మన ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఎందుకంటే, రాత్రి టైమ్‌లో మన శరీరానికి ఏ ఫుడ్ అందదు. కానీ, అవయవాలు నిరంతరం పనిచేస్తూనే ఉంటాయి. అయితే, ఉదయాన్నే ఆకలి అవుతుంది. ఆ ఆకలి తీర్చుకోవడానికి పోషకాహారం తీసుకోవాలి. దీని వల్ల శరీర అవయవాలకి మేలు జరుగుతుంది. అలా కాకుండా చక్కెర కలిపిన పండ్ల రసాలు తీసుకుంటే చాలా ఆరోగ్య సమస్యలు వస్తాయి.

జుట్టు, స్కిన్‌కి హెల్ప్ చేసే బెస్ట్ డ్రింక్..

**తాజా పండ్ల రసాల్లో..**తాజా పండ్లలో కరికే, కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. వాటిని తిన్న తర్వాత జీర్ణం చేయడానికి మన జీర్ణ వ్యవస్థకి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి, రక్తంలో షుగర్ లెవల్స్ మెల్లిగా పెరుగుతాయి. కానీ, పండ్ల రసాల విషయానికొస్తే పీచు తొలగిపోతుంది. కాబట్టి, ఈ జీర్ణ వ్యవస్థ ఆహారాన్ని తక్కువ సమయంలోనే జీర్ణం చేసి రక్తంలోకి చక్కెరని విడుదల చేస్తుంది. అప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా పెరుగుతాయి. దీనిని డాక్టర్స్ షుగర్ స్పైక్ అని చెబుతారు. అది మంచిది కాదు. దీని వల్ల గుండె సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యల్ని పెంచుతాయి.





**జీర్ణ సమస్యలు..**మన జీర్ణ వ్యవస్థ సరిగ్గా పనిచేయాలంటే పండ్లని అలానే తినాలి. అప్పుడే ఫైబర్ చక్కగా అందుతుంది. ఆహారం కూడా చక్కగా జీర్ణమవుతుంది.

**దంతాల సమస్యలు..**పండ్ల రసాలని పరగడపున తసీుకుంటే దంతాల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఎందుకంటే పండ్ల రసాల్లో కొద్దిగా ఆమ్లాలు ఉంటాయి. ఇవి దంతాల ఎనామిల్‌ని కరిగించి కేవిటీస్, జివ్వుమనే అనుభూతిని కలిగిస్తాయి. కానీ, మనం అవే జ్యూస్‌ని లంచ్, డిన్నర్‌లో తీసుకుంటే అసిడిటీని తగ్గిస్తాయి. ఆల్కలీన్ ఫుడ్స్ పూర్తిగా అసిడిటీని బ్యాలెన్స్ చేస్తాయి. కాబట్టి, పరగడపున కాకుండా ఏమైనా తిన్నప్పుడు మాత్రమే పండ్ల రసాలను తీసుకోండి.

**క్రేవింగ్స్ పెరగడం..**రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినట్లే.. కొన్ని రోజుల తర్వాత అదికూడా అకస్మాత్తుగా తగ్గుతుంది. దీని కారణంగా, కేలరీలు కూడా తగ్గుతాయి. దీని వల్ల అలసిపోవడం జరుగుతుంది. బ్రెయిన్ ఈ అలసట కారణంగా ఏదైనా తినాలనే క్రేవింగ్స్ పెరుగుతాయి. దీంతో ఎక్కువ తింటారు. బరువు పెరిగే అవకాశం ఉంది.

**లంచ్, డిన్నర్‌లో తీసుకోవడం..**పండ్ల రసాలను పగరడపున కాకుండా లంచ్, డిన్నర్‌తో తీసుకుంటే షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. ఆకలి తగ్గుతుంది.

ఆహారాలతో తీసుకున్నప్పుడు పోషకాల శోషణ పెరుగుతుంది.

పండ్ల రసాలను మన భోజనంలో తీసుకున్నప్పుడు శరీరానికి ఎలాంటి పోషకాల కొరత ఉండదు.

పండ్ల రసాలు రుచికరంగా ఉంటాయి. దీంతో మనం ఫుడ్‌ని ఆస్వాదిస్తూ తీసుకోవచ్చు.

సన్నగా ఉన్నవారితో పోలిస్తే లావుగా ఉన్నవారికి అన్ని డ్రెస్సెస్ సెట్ అవ్వాలంటే కాస్త కష్టం. అయితే, వారు ఎంచుకునే వాటిని సరిగ్గా సెలక్ట్ చేసుకుంటే మాత్రం లావుగా ఉన్నా ఫ్యాషన్‌గా కనిపిస్తారు. ఇందులో సెలక్షన్ కీ రోల్ పోషిస్తుంది. మరీ, అలా లావుగా ఉన్నవారు ఎలాంటి బట్టల్ని సెలక్ట్ చేసుకోవాలో.. ఏవి అట్రాక్టివ్‌గా ఉంటాయో ఇప్పుడు తెలుసుకోండి.

**లో వెయిస్ట్ జీన్స్..**లో వెయిస్ట్ జీన్స్ కూడా చాలా మంది ఇష్టంగా ఉంటారు. కానీ, ఇది కూర్చొనేటప్పుడు చాలా ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి, అలా కాకుండా మీ బెల్లీని కవర్ చేసే నార్మల్ జీన్స్ వేసుకోండి. దీని వల్ల నార్మల్‌గానే కనిపిస్తారు.

**క్లచ్చర్‌తో జుట్టు స్టైలింగ్..**

**టైట్ టీషర్ట్స్, బట్టలు..**అదే విధంగా, మరీ టైట్‌గా ఉండే టీషర్ట్స్, బట్టలు కూడా వేసుకోవద్దు. దీని వల్ల కూడా మీరు ఎక్కువగా లావుగా కనిపిస్తారు. మీ సైజ్‌కి తగ్గవి.. కాస్తా లూజ్‌గా ఉండేవే ఎంచుకోవడం మంచిదని గుర్తుపెట్టుకోండి.

**మరీ లూజ్‌గా వద్దు..**అయితే కొంతమంది లూజ్‌గా ఉన్న బట్టలు వేసుకుంటే అందులోనే మన బెల్లీ, బాడీ కలిసిపోతుంది. లావుగా ఉన్నామనేది తెలియదనుకుంటారు. ఇలా చేయడం వల్ల మరింత లావుగా కనిపిస్తారు. అలా కాకుండా మీరు ఉన్న సైజ్ కంటే ఓ సైజ్ ఎక్కువగా ఉండే బట్టల్ని ఎంచుకోండి. దీని వల్ల మీరు లావుగా కనిపించరు.

**సింగిల్ లేయర్ వద్దు..**కొంతమంది ఎక్కువగా బట్టలు వేసుకుంటే మరీ లావుగా కనిపిస్తామనుకుంటారు. కానీ, సింగిల్ లేయర్‌వి అలా వేసుకున్నప్పుడు బాడీ పార్ట్స్ ఆ లేయర్స్ నుంచి బయటికి కనిపిస్తూ ఇబ్బందిగానే కాకూండా లావుగా కనిపించేలా చేస్తాయి. కాబట్టి, డబుల్ లేయర్స్‌వి ఎంచుకోవాలి.

# ఈ బట్టలు వేసుకుంటే లావుగా ఉన్నా స్టైల్‌గా కనిపిస్తారు..







# పార్వతి పాత్రను కోల్పోయిన షావుకారు జానకి



చిత్ర పరిశ్రమలో ఎవరి అదృష్టం ఎలా, ఎప్పుడు తలుపు తడుతుందో ఎవరూ చెప్పలేరు. ఒక్క సినిమా చాలు నటుల జీవితాలు మారిపోవడానికి. ‘షావుకారు’ చిత్రాన్నే తన ఇంటి పేరుగా మార్చుకుని ఎన్నో అద్భుతమైన పాత్రల్లో మెప్పించారు జానకి. ఇక అక్కినేని నాగేశ్వరరావు నటించిన ‘దేవదాసు’ గురించి చెప్పడానికి పదాలు సరిపోవు. దేవదాసుగా అక్కినేని, పార్వతిగా సావిత్రి ఆ పాత్రల్లో జీవించేశారు. అయితే, ఈ పాత్రకు తొలుత అనుకున్నది షావుకారు జానకినేనట. ఓ సందర్భంలో దీని గురించి జానకి పంచుకున్నారు.“దేవదాసు’ ప్రారంభంచనున్న కాలంలో ఒకనాడు నిర్మాత డి.ఎల్.నారాయణ, రచయిత సముద్రాల మా ఇంటికి వచ్చారు. విషయం వివరించి, నన్ను పార్వతి పాత్ర ధరించమన్నారు. నాగేశ్వరరావు దేవదాసుగా నటిస్తారని, తక్కిన పాత్రలను ఇంకా నిర్ణయించలేదని చెప్పారు. నేను చాలా సంతోషించాను. నాకు గొప్పపాత్ర లభించిందని తెగ సంబరపడిపోయాను. అందుకు వారికి ధన్యవాదాలు కూడా తెలిపాను. ‘ఓ దేవదా..’ పాట రికార్డయితే, ఆ పాటను టేప్ రికార్డులో పంపారు. నేను వింటూ రోజూ సాధన చేయటం మొదలు పెట్టా. షూటింగ్ తేదీలను కూడా ఖరారు చేశారు.” “ఒకరోజు ఒకాయన మా ఇంటికి వచ్చి ‘ఆ సినిమాకి నేను ఫైనాన్స్ చేస్తున్నా. ‘దేవదాసు’లో పార్వతి మీరు కాదు. ఇంకొక నటి చేస్తున్నారు’ అని చెప్పి టేప్ రికార్డరు పట్టుకుపోయారు. నేను చాలా కుంగిపోయాను. ఆ తర్వాత ఆ పాత్రను సావిత్రి చేస్తున్నట్లు విన్నాను. అయితే, సినిమా చూశాక, ఒక గొప్ప నటి పార్వతి పాత్రలో అద్భుతంగా రాణించిందని సావిత్రిని మనసారా కౌగిలించుకొని, అభినందిచాను” అంటూ పార్వతి పాత్రను తాను చేయకపోవడం వెనుక కారణాన్ని చెప్పుకొచ్చారు.

# చాలా రకాలుగా ప్రత్యేకం.. సత్యభామ

“నాయికా ప్రధానమైన సినిమాలు చాలా వచ్చాయి. కానీ ఇప్పటికీ వాటిలో మొదట గుర్తొచ్చేది విజయశాంతి ‘కర్తవ్యం’. అంతకంటే బలమైన నాయిక పాత్రతో రూపొందిన సినిమానే మా ‘సత్యభామ’.

“నాయికా ప్రధానమైన సినిమాలు చాలా వచ్చాయి. కానీ ఇప్పటికీ వాటిలో మొదట గుర్తొచ్చేది విజయశాంతి ‘కర్తవ్యం’. అంతకంటే బలమైన నాయిక పాత్రతో రూపొందిన సినిమానే మా ‘సత్యభామ’. అసాధ్యమైన పనిని



ఓ మహిళ సాధించిన తీరు ఈ కథలో హైలెట్” అన్నారు నిర్మాతలు బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి. అవురమ్ ఆర్ట్స్ పతాకంపై ఆ ఇద్దరూ తొలి ప్రయత్నంగా నిర్మించిన సినిమానే ‘సత్యభామ’. కాజల్ ముఖ్యభూమిక పోషించారు. సుమన్ చిక్కాల దర్శకుడు. ‘మేజర్’ దర్శకుడు శశికిరణ తిక్క సమర్పణలో.. ఆయన రచించిన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు నిర్మాతలు.

“ఇరవయ్యేళ్ల కిందట జరిగిన ఓ వాస్తవ సంఘటనని స్ఫూర్తిగా తీసుకుని ఈ కథ తయారు చేశాడు దర్శకుడు. ఈ కథని తెరపైకి తీసుకు రావాలని నిర్ణయించుకున్నాక, హీరోయిన్ విషయంలో ముగ్గురు, నలుగురు పేర్లు అనుకున్నా, తొలి పేరు మాత్రం కాజల్‌దే. ఒకవేళ ఆమె ఈ కథని తిరస్కరిస్తే మరో కథానాయిక దగ్గరికి వెళ్లాలనుకున్నాం. కానీ కాజల్ ఈ కథ విన్న వెంటనే చేయడానికి ముందుకొచ్చారు. వాస్తవానికి ఆమె ఓ కథ విన్నాక రెండు మూడు రోజుల తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తారట. కానీ ‘సత్యభామ’ కథ విషయంలో సమయమే తీసుకోలేదు. నిర్మాతలుగా మేం ఆ కథ విన్నాక ఎంత ఆత్రుతకి గురయ్యామో, ఆమె కూడా అదే అనుభూతికి గురయ్యారు. కథ, హీరోయిజం మొదలుకొని చాలా రకాలుగా ఇది ప్రత్యేకమైన సినిమా. ఓ బలమైన సందేశం కూడా ఉంటుంది. షి సేఫ్ యాప్ గురించి మా సినిమాలో చెప్పిన విషయాలు ఆలోచనని రేకెత్తిస్తాయి”.

“శశికిరణ్ తిక్క నాకు సోదరుడు (బాబీ తిక్క). ఆయన వల్లే మేం చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాం. కొంతకాలంగా నేను, శ్రీనివాసరావు సినీ పంపిణీలో కొనసాగుతున్నాం. శశి ‘మేజర్’ పూర్తి చేశాక మేం సొంత నిర్మాణ సంస్థని ఏర్పాటు చేయాలనుకున్నాం. మనకు నచ్చిన కథల్ని నచ్చినట్టు తెరపైకి తీసుకు రావచ్చనే ఉద్దేశంలో భాగంగానే నిర్మాణంలోకి వచ్చాం. శశి చేతిలో వేరే ప్రాజెక్టులు ఉండటంతో మేం ‘సత్యభామ’ కథని విని ఈ సినిమాతో ప్రయాణం మొదలుపెట్టాం. తొలి సినిమాని హీరోతో కాకుండా, హీరోయిన్ ప్రధానమైన సినిమా తీస్తున్నారేమిటి అని చాలా మంది అడిగారు. అయితే దీన్ని హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమా అనడం కంటే, హీరోయిజం ఓరియెంటెడ్ సినిమా అని చెప్పాలి. అంత బలమైన పాత్రలు ఇందులో ఉన్నాయి. కాజల్ చక్కటి సహకారం అందించారు. ఇది నా సొంత నిర్మాణ సంస్థ అన్నారు. అంతగా ఆమెతో మాకు అనుబంధం పెరిగింది. తెలుగులో విజయవంతమైన తర్వాత, దీన్ని ఇతర భాషల్లోకి తీసుకెళ్లడంపై ఆలోచన చేస్తాం. మా తదుపరి సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో తీసుకు రావడానికి ప్రయత్నిస్తాం”.

# అందుకే మా ఇద్దరి కాంబోని ఆదరించారు – తమన్నా

‘అరణ్మనై 4’ (తెలుగులో ‘బాక్’)తో ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చారు నటి తమన్నా. సుందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాశీఖన్నా కూడా ప్రధాన పాత్రలో నటించారు. ఈ సినిమాలో రాశీతో కలిసి పని చేయడంపై తమన్నా స్పందించారు. ఒకరికొకరు సపోర్ట్‌గా ఉన్నట్లు చెప్పారు.

‘ఒక సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉన్నప్పుడు ఇద్దరి నటనను ప్రేక్షకులు గమనిస్తారు. పోలికలు పెడుతుంటారు. అలా పోల్చడం కూడా మంచిదే. యాక్టర్స్‌లో బాగా నటించాలనే తపన పెరుగుతుంది. ‘అరణ్మనై 4’లో నేను, రాశీఖన్నా కలిసి నటించాం. ఒక పాటలో కలిసి డ్యాన్స్ చేశాం. దాని గురించి ఇద్దరం చర్చించుకున్నాం. ఒకరికొకరం సపోర్ట్ చేసుకున్నాం. అందుకే మా కాంబో హిట్ అయింది. నేను ఇప్పటివరకు ఎంతోమంది కోస్టార్స్‌తో పని చేశాను. కానీ, రాశీతో కలిసి పనిచేయడం చాలా సరదాగా అనిపించింది. కోస్టార్స్ అందరూ అలాఉంటే సెట్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది’ అని తమన్నా చెప్పారు.

**పోటీ ఎప్పుడూ ఉంటుంది.. మరింత కష్టపడి పనిచేస్తా: సమంత**

‘అరణ్మనై’ ఫ్రాంచైజీ దాదాపు పదేళ్లక్రితం మొదలైంది. 2014లో విడుదలైన ‘అరణ్మనై’ సూపర్‌హిట్ అందుకోవడంతో దానికి సీక్వెల్‌గా ‘అరణ్మనై 2’ తెరకెక్కించారు సుందర్. 2016లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మంచి వసూళ్లు రాబట్టింది. దాదాపు ఐదేళ్ల గ్యాప్ తర్వాత 2021లో ‘అరణ్మనై 3’ విడుదలైంది. అదీ విజయాన్ని అందుకోవడంతో పార్ట్4ను రూపొందించారు.




# ఆశిష్.. ఆయేషాల ప్రేమ ప్రయాణం మొదలు



దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది అందాల తార రకుల్ ప్రీత్ సింగ్. ఇటీవలే తన ప్రియుడితో కలిసి ఏడడుగులు వేసిన ఈ భామ.. ప్రస్తుతం తన రాబోయే సినిమాల చిత్రీకరణలతో బిజీగా గడుపుతోంది. ఆమె, బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ జంటగా నటిస్తున్న చిత్రం ‘దే దే ప్యార్ దే 2’. 2019లో విడుదలైన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘దే దే ప్యార్ దే’కి కొనసాగింపుగా రాబోతున్న చిత్రమిది. అన్షుల్ శర్మ దీన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను ముంబయిలో ప్రారంభించినట్లు ఇన్‌స్టా వేదికగా తెలిపింది రకుల్. ఇందులో అనిల్ కపూర్, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భూషణ్ కుమార్, లవ్‌రంజన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మే 1న విడుదల కానుంది. మధ్య వయసు గల ఆశిష్ అనే వ్యక్తి.. 20ఏళ్ల ఆయేషా ప్రేమ కోసం పరితపిస్తుంటాడు. వయసుతో సంబంధం లేకుండా మొదలైన వీరిద్దరి ప్రేమ నెగ్గిందో లేదో తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. ప్రస్తుతం రకుల్ కీలక పాత్రలో నటించిన ‘ఇండియన్ 2’ విడుదలకు సిద్ధంగా ఉంది.

# పోరు బాటలో నాని

‘సరిపోదా శనివారం’తో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాని వివేక్ ఆత్రేయ తెరకెక్కిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ‘సరిపోదా శనివారం’తో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు నాని. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాని వివేక్ ఆత్రేయ తెరకెక్కిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. ఎస్.జె.సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా తాజాగా హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకుంది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో నానిపై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. దీనికి రామ్‌–లక్ష్మణ్ నేతృత్వం వహిస్తున్నట్లు తెలిసింది. దాదాపు పదిరోజులకు పైగా ఈ షెడ్యూల్ సాగనున్నట్లు తెలుస్తోంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతోన్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఆగస్టు 29న విడుదల కానుంది. దీనికి సంగీతం: జేక్స్ బిజోయ్, ఛాయాగ్రహణం: జి.మురళి.

# ఇలాంటి చిత్రం చేయడం నాకిదే తొలిసారి

‘ఖుషి’, ‘హాయ్ నాన్న’ సినిమాలతో తెలుగు సినీ సంగీత ప్రియుల్ని మెప్పించారు సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్. ఇప్పుడాయన సంగీత దర్శకత్వంలో వస్తున్న కొత్త చిత్రం ‘మనమే’. శర్వానంద్ హీరోగా నటించిన ఈ సినిమాని శ్రీరామ్ ఆదిత్య తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. కృతిశెట్టి కథానాయిక. ఈ చిత్రం ఈనెల 7న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు హేషమ్.



“హాయ్ నాన్న’కు పూర్తి భిన్నమైన చిత్రం ‘మనమే’. అన్ని రకాల భావోద్వేగాలతో నిండి ఉన్న పక్కా వాణిజ్య చిత్రమిది. దీంట్లో సంగీతానికి ఎంతో ధాన్యముంది. ఇందులో మొత్తం 16 పాటలున్నాయి. ఇలాంటి సినిమా చేయడం నా కెరీర్‌లో ఇదే తొలిసారి. నిజానికి ఈ చిత్ర సంగీతం పనులు మొదలు పెట్టినప్పుడు ఇన్ని పాటలు వస్తాయని మేము ఊహించలేదు. కానీ, శ్రీరామ్ ఆదిత్య ఈ చిత్రాన్ని అద్భుతంగా మలిచి మంచి మ్యూజిక్ చేసే అవకాశమిచ్చారు.

కథ రీత్యా ప్రథమార్ధంలో 10 పాటలు.. ద్వితీయార్ధంలో 6 పాటలు పెట్టాల్సి వచ్చింది. వీటిలో 10పాటలు పూర్తి నిడివితో ఉంటాయి. మిగిలినవి బిట్స్ సాంగ్స్‌లా ఉంటాయి”.

“శర్వానంద్ కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోయే చిత్రమిది. అలాగే ఇందులో కృతిశెట్టి నటన కూడా అందర్నీ ఆకట్టుకుంటుంది. విక్రమ్ ఆదిత్య పాత్ర సర్‌ప్రైజ్ చేస్తుంది. ఇవే కాక దీంట్లో మరికొన్ని అందమైన పాత్రలూ ఉన్నాయి. సినిమా పూర్తయ్యాక కూడా వీళ్ల పాత్రలు మీ మదిలో అలా గుర్తుండిపోతాయి. ఈ చిత్రానికి నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దానికోసం మేము రెండు నెలలు కష్టపడ్డాం”.

“తెలుగు చిత్ర పరిశ్రమలో భాగమైనందుకు నాకు చాలా గర్వంగా ఉంది. ఇక్కడ సంగీతాన్ని ప్రేక్షకులు గొప్పగా వేడుక చేసుకుంటారు. అలాగే ఎంతో గౌరవంగా, ప్రేమగా చూస్తారు. అందుకే హైదరాబాద్‌ను నా రెండో ఇల్లుగా భావిస్తాను. ప్రస్తుతం నేను రష్మిక ‘ది గర్ల్ ఫ్రెండ్’ చిత్రానికి సంగీతమందిస్తున్నాను. అలాగే మరికొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి”.

“ప్రతి సంగీత దర్శకుడు విభిన్నమైన కథలతో ప్రయాణం చేయాలని అనుకుంటాడు.

నా కెరీర్ ఆరంభంలోనే అలాంటి చిత్రాలతో నిరూపించుకునే అవకాశం రావడం ఆశీర్వాదంగా భావిస్తున్నా. నా సంగీత ప్రతిభ అంతటినీ ‘మనమే’ ద్వారా ప్రేక్షకులకు చూపించుకునే అవకాశం దొరికింది. అందుకే దీనికోసం నా గత చిత్రాల కంటే ఎక్కువ కష్టపడ్డాను. నాకే కాదు శర్వా, శ్రీరామ్, కృతి.. ఇలా ప్రతి ఒక్కరికీ ఇది ఎంతో ప్రత్యేకమైన చిత్రం. దీనికోసం చిత్ర బృందమంతా ప్రాణం పెట్టి పని చేసింది. దీనిపై మేమంతా చాలా నమ్మకంగా ఉన్నాం”.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com